శివనాథశాస్త్రి

జాతిభేదము

కాకినాడ, 1916

Record no. 752

Śivanāthaśāstri

Jātibhēdamu

Kākināḍa, 1916

Record no. 752

శివనాథశాస్త్రి.

జాతిభేదము / శివనాథశాస్త్రిచే బంగాళీ భాషలో నొసంగింపబడిన యుపన్యాసమున కాంధ్రానువాదము ఇప్పగుంట సుబ్బుకృష్ణయ్యచే రచియింపబడినది. - కాకినాడ : వింజమూరి వెంకట లక్ష్మీనరసింహారావు, 1916.

3, 85 p. ;18 cm.

Record no. 752

Śivanāthaśāstri.

Jātibhēdamu / Śivanāthaśāstricē Baṅgāḷī bhāṣalō nosaṅgimpabaḍina yupanyāsamuna Kāndhrānuvādamu Ippaguṇṭa Subbukr̥ṣṇayyacē raciyimpabaḍinadi. - Kākināḍa : Viñjamūri Veṅkaṭa Lakṣmīnarasiṃhārāvu, 1916.

3, 85 p. ;18 cm.

Record no. 752

Bundle No. 10

752

జీవ భేధములు

S/No. 244

Acc No. 6944

ఓమ్

జాతిభేదము.

ఇది

ప్రసిద్ధసంస్కర్తలగు శ్రీయుత పండిత శివనాథశాస్త్రిగారిచే బంగాళీ భాషలో నొసంగఁబడిన యుపన్యాసమున కాంధ్రానువాదము.

శ్రీయుత ఇప్పగుంట సుబ్బకృష్ణయ్యగారిచే
రచియింపఁబడి

వింజమూరి వెంకట లక్ష్మీనరసింహారావుచేఁ
బ్రకటింపఁబడినది.

కాకినాడ.
శ్రీ సావిత్రీ ముద్రాక్షరశాల నుద్రితము.
1916.

వెల 6 అణాలు.

పీఠిక.

ఈపుస్తకము కలకత్తా నగరమునందలి సాధారణబ్రాహ్మసమాజ ప్రచారకులలో నగ్రగణ్యులగు పండిత శివనాథశాస్త్రి ఎం. ఏ. గారిచే బంగాళీ భాషయందు నొసంగబడిన యుపన్యాసము ననుసరించి వ్రాయబడినది. శాస్త్రిగారిట్టి పుస్తకమును వ్రాయుటకు సర్వవిధములఁ దగినవారని వేఱుగ వ్రాయనక్కఱలేదు. వీరు సంస్కృతభాషయందసమానపాండిత్యమును సంపాదించి తమనిరుపమానమగు జీవితమును మతపరిశ్రమమునందును, సద్ధర్మసంస్థాపనమునందును, దేశ సేవయందును, మానవహృదయాంతరాళములయం దీశ్వరభక్తిని పురికొల్పుటయందును గడచిన నలువది సంవత్సరములనుండియు గడపుచు, ఇంత వృద్ధాప్యమున సయితము తమ యావచ్ఛక్తులను ఈశ్వరసేవయందే నియోగించుచుండెడివారు. మఱియు వంగదేశమునందలి కులీన బ్రాహ్మణవంశమున జన్మించియు, మన దేశమునకు జాతిభేదమువలన గలుగు నిక్కట్టులను గ్రహించినవారగుటచేతను, మఱియు నిట్టి జాతిభేదమును సమర్థించు ఈశ్వరసమ్మతముగాదనియు, ధర్మవిరుద్ధమనియు, అన్యాయమనియు దృఢముగ నమ్మినవారగుటచే కేవలము మాటలతో తృప్తినొందక కార్యాచరణమునకు సాహసించి తత్ఫలితముగ ననేకకష్టంబులంబడినవారు. వీరు కేవలము యజ్ఞోపవీత

విసర్జనముతోడనే సర్వసమతాభావము బొందితిమని సంతసిం
చువారలలో జేరక కేవలమునను కూలానుసారముగ సమయము
తటస్థించినపుడు ఇష్టమువచ్చినజోటులనెల్ల భుజించి తమయొక్క
మానవభాతృభావమును నిలుపుకొనజూచువారలలోను జేరక
మన దేశమునందు ప్రబలియున్న వివిధజాతులవారును పరస్పర
వైవాహిక సంబంధము లొనరించుకొనిననేగాని వారలలో ప
రస్పర మైత్రి నెలకొల్పబడ నేరదని నమ్మువారలలో వీరును
నొక్కరగుటచే విద్యావతులగు తమ పుత్రికలనే బ్రాహ్మణేత
ర జాతులవారికిచ్చి పరిణయముగావించిన ధీరులు. వీరినిగూర్చి
యిక విశేషముగ వ్రాయనక్కఱలేదు. వీరి యుపన్యాసమును
శాంతముగ జదివి యందలి యంశములను విమర్శించి గ్రహిం
చుటకుం దగిన ఓర్పుమాత్రము మాపాఠకులకు గలిగియుండిన
శాస్త్రిగారి పాండిత్యమును, ధీరత్వమును, తమంతటనే వెల్లడి
కాగలవు. శాస్త్రిగారివంటి మహాపురుషులు మన దేశమున కొ
ద్దిగనో గొప్పగనో యచ్చటచ్చట నుండుచుండుటచేతనే సం
స్కరణ ప్రయత్నములు కొంచెమయినను సాఫల్యత నడయు
చున్నదిగాని యందఱును ఉపన్యాసకులును, శాస్త్రవిశారదు
లును, తత్వదర్శనిరూపణులును, వాగ్వివాదనైపుణ్యులు నైన
యెడల, కార్యాచరణమునకుం బూనుకొనువారు లేకయేపోవు
దురు. మన దేశమున ప్రస్తుత మెవరయిన బహుకాలమునుండి
ప్రబలితమగుచుండిన యాచారమునందలి దోషములను జూప

సమకట్టిన, వారు దేశాభిమాన రహితులుగ నెన్నబడుదురు. అ
యినను మేముమాత్రము సంపూర్ణమయిన దేశసేవానురక్తులము
గుటచేతనే, ఈపుస్తకమును ప్రకటించుటకయిన న్యాయముల
ను సయితము రాబట్టుకొనజాలమని తెలిసియు పునరుద్ధారక
వాదుల ప్రలాపములకు బాల్పడకతప్పదని తెలిసియుండియు నీ
కార్యమునకు గడంగితిమి. జనులలో యభిప్రాయభేదము లుం
డక మానవు. కాని బుద్ధిమంతులగు వారుమాత్ర మొండొరుల
యభిప్రాయములను సానుభూతితో తెలిసికొని యందలి సత్య
ములను గ్రహించుటకుమాత్రము తమ హృదయములను తెఱ
చియుంచుకొనిన చాలును. తాము నమ్మిన సత్యముల ననుష్ఠిం
చుటకు శక్తిలేక, సత్యమును వక్రపఱచి ఇతరులను సయితము
నసత్యమున నుంచుటకు పూనికొనిన పండితునికంటె, విశేషజ్ఞా
నము లేకపోయినను, తాను నమ్మినప్రకార మాచరించెడి పా
మరుడే యత్యంతగౌరవనీయుడు. దురాచారమునయినను స
హింపనగునుగాని, దురాత్ముని, దుష్టచిత్తుని, దుష్పాండిత్యము
నుమాత్రము దేశశ్రేయోభిలాషులెప్పుడును మన్నింపరు. ఈగ్రం
థమును అచ్చొత్తించి, శుద్ధపత్రములను సరిజూచి మాకనేకవిధ
ముల తోడ్పడిన శ్రీయుత వింజమూరి వెంకట లక్ష్మీనరసింహ
రావు పంతులుగారికి మేము మిక్కిలి కృతజ్ఞులము.

రామమోహనాశ్రమము, కాకినాడ.
1 వ యేప్రియల్ 1916. } గ్రంథకర్త.

ఓం.

జాతిభేదము.

జాతిభేద మేవిధముగా నేర్పడినది? దానికిఁ బ్రమాణములగు విషయములన్నియు మన మెచటినుండి సంగ్రహించుచున్నారము? దేనిని మనము విశ్వాసయోగ్యమయిన చరిత్రాంశవిషయమని నమ్ముచున్నామో, దేనియం దతీతకాలముయొక్క యితివృత్తము వర్ణింపఁబడి యున్నదో, మఱియును జాతిత్రికవిషయములని ప్రతీతిగాంచుచున్నవో, యవన్నియును, గవికొన్నాదూషితములయి, బహుపూర్వకాలపు చరిత్రవిషయములని భావించుటకు దుష్కరమైయున్నయవి. ఇట్టిస్థితిలో నుపాయాంతర మేమి? మన జాతీయసాహిత్యాంతర్గత కావ్య, నాటక, ధర్మశాస్త్ర, పురాణాదిగ్రంథముల కాలనిర్ణయము నేవిధముగనైన చేయనగునేని వానినుండి మనము బహుళపరిమాణము, ఆజాతియొక్క సామాజిక చరిత్రమును నిర్ణయింపనగును. వేదములలో నేసామంత్రైనను "ఓ యింద్రా, నీవు నీయుపాసకులచెంతకు రమ్ము, పణిజు లేవిధముగా

సముద్రమున నోడను వదలి యంతరంగమున నుప్పొంగుచుం దురో యావిధముగ మేమును నీకొఱకై యుత్కంఠితచిత్తములతో నెదురుచూచుచున్నాము" అనెడి వాక్యము లుండునెడ దీనినిబట్టి యాకాలమున వణిజులు ధనము నార్జించుటకై సముద్రయానము చేయుచుండిరని యూహింపనగునుగదా? అదే తీరున జాతిభేదమును గూర్చియు, మొదటి యేర్పాటులకొఱకు ప్రాచీనధర్మశాస్త్రముల నన్నిటిని నవలంబనముగాఁ జేసికొని చరిత్రాంశమును నిర్ధారణచేయవలసియుండును.

వేదము లన్నిగ్రంథములకంటెను ఆదిమగ్రంథములు. వానిలో ఋగ్వేద మతిపురాతనము. ఈ ఋగ్వేదమును గూర్చి మన మిచ్చట నొకటి రెండు విషయములు తెలిసికొనవలసియున్నవి. ఇది ఛందోబద్ధములగు కొన్ని మంత్రసముదాయములతో నొప్పెడి గ్రంథరాజము. దీనిలోని మంత్రములన్నియును నేకకాలమున రచింపఁబడినవి కావు. దానిభాష మిక్కిలి వర్ణనీయము; దానిలో వర్ణింపఁబడిన సామాజికచిత్రము లాదిగాఁగల విషయములఁ బరికించిన, నవి యనేకయుగములలో రచింపఁబడి యుండవచ్చునని తోఁచెడిని. ఈమంత్రములన్నిటిలో జ్యేష్ఠాంశము, వర్ణమాల సృష్టింపఁబడుటకు పూర్వమును, వ్రాయుపద్ధతియును నలవాటులోనికి రాకపూర్వమే రచింపఁబడి యుండెను. అప్పు డీమంత్రములన్నియు

నోటిచే రచింపఁబడుచు, ముఖాముఖిని బోధింపఁబడుచు మఱియు నవిచ్ఛిన్నపూర్వకముగా వ్యాపింపఁ జేయఁబడుచుండెను. జనులు మంత్రములను వీనోటినుండియు, వానినోటినుండియు, సర్వదా వినుచుండెడివారు, కాని యవిమాత్రము వ్రాయఁబడి యుండినటుల నెవరును, ఎప్పుడును చూచియుండలేదు. వానినిమాత్రము వ్రాయుటకై ఎవరును ఎప్పుడును ప్రయత్నించి యుండలేదు. ఈ కారణముచేతనే ఈమంత్రములన్నియు శ్రుతులని వ్యవహరింపఁబడుచు వచ్చినవి. అటుతరువాత కొంతకాలమునకు వర్ణమాల సృష్టింపఁబడిన తరువాత నప్పుడపుడు కొందరు శ్రద్ధవహించి తమకు జ్ఞాపకమున్నవానిని, ఇతరులనుండి సంగ్రహించిన మంత్రముల నన్నిటిని వర్ణితవిషయానుసారముగ, మండలములు, అధ్యాయములు సూక్తములు మున్నగు విభాగములుగా గ్రంథాకారమున నిబద్ధము చేసిరి. అట్లు రచించిన పండితు లందరును వేదవ్యాసులనియె పరిగణింపఁబడుచున్నారు. ఋగ్వేదములో నేదైన నొక సూక్తమును జదువుట కారంభించిన, నది యేదేవతకు, నేఋషికి, నేఛందమునకు సంబంధించినదో మనము తెలిసికొందుము. దీని తాత్పర్యమేమనఁగా నాసూక్తమును సంగ్రహించిన పండితుఁడు దానిని సంగ్రహించునపు డాసూక్త మెవరిచే రచియింపఁబడినటుల జనులలో వాడుకగలదో నామంత్రములకు నగ్రభాగమున నాతనిపేరు నిర్దేశింపఁబడెననియే. దీనికి దృష్టాంతము

వీధులలోఁ దిరుగుచుండెడి యాచకులవద్దనుండి మన మెన్ని కృతులను, తత్త్వములను పాడుచుండుటను వినుటలేదు? అందులోఁ గొన్ని కవిరామప్రసాదునిచేతను, గొన్ని దివాంజీచేతను, మఱికొన్ని శ్రీధరునిచేతను, యింకను గొన్ని తదితరకవులచేతను రచియింపఁబడి యుండలేదా? మన మీగానముల ననేకదినములుగా వినుచునేయున్నాము. మనలోఁ గొందఱికా గీతములు ముఖస్థముగను వచ్చును. కాని యవి మాత్ర మెప్పుడును పుస్తకరూపమును దాల్చియుండలేదుగదా! ఇపు డెవరైయున నాగీతముల నన్నిఁటిని సంగ్రహించి పుస్తకముగఁ బ్రచురింపవలయునన్న నేమిచేయవలసియుండును? అతఁడు ఈభిక్షుకునివద్దనుండి పది, యాభిక్షుకునివద్దనుండి మఱియొక పది, మఱియొకనివద్దనుండి మఱికొన్నిగా సంగ్రహింపవలసియుండును మఱియు సంగ్రహించినవానిని నెల్ల విద్యాపతికాలమునుండి నేటివరకును, అనగా రెండుమూడు శతాబ్దముల కాలములో భిన్నభిన్నసమయములందు వేర్వేరుకవులచేతను, భక్తపుంగవులచేతను రచింపఁబడిన గానముల నన్నిఁటిని ఒక్కచోట సిద్ధము చేయవలసియుండును. మఱియు భిక్షుకు లాగానములను రచియించినవా రెవరని తెల్పెదరో వారినామధేయములను సహిత మాగీతముల రచయితలుగా చేర్పవలసియుండును. వేదమంత్రము లన్నియునుగూడ నీవిధముగనే సంగ్రహింపఁబడి, విభజింపఁబడినవి. ఏది యెట్లున్నను, వేదములనుగూర్చి

యింత చెప్పుటవలన తెలిసికొనవలసిన విషయ మేమనఁగా, వేదములలోని మంత్రము లన్నియు నేకకాలమున రచియింపఁబడియుండలేదనియు, కొన్ని మంత్రములు మఱికొన్నిఁటికంటె వేయిసంవత్సరములకు తరువాతనుగూడ రచింపఁబడెననియు, మీ రెల్లపుడును జ్ఞాపకమునం దుంచుకొనవలయుననియే. ఈవేదమంత్రముల నన్నిఁటినుండియు నాదిమభారతసమాజమును గూర్చి యనేకవిషయములను దెలిసికొననగును. మఱియు నీమంత్రములను శ్రద్ధతోఁ జదివి అనేక పండితులు పురాతన ఆర్యసంఘపుస్థితిని గూర్చి యనేకవిషయముల నిరూపణముఁ జేసియున్నారు. ఈమంత్రములను జదివిన వేదోక్తార్యులు (౧) సువిశాలమగు నగరములను నిర్మాణముఁ జేసియుండిరనియు, (౨) వెండి బంగారపు టలంకారములను జేసిరనియు, (౩) యుద్ధభూములందు దేహరక్షణార్థ మినుపకవచములను దొడుగుచుండిరనియు, (౪) శరతూణీరములు మున్నగాఁగల సాంగ్రామిక ప్రహరణముల నన్నియుఁ గలిగియుండిరనియు, (౫) వాద్యయంత్రముల నన్నిటిని జేయుటయెగాక, వానిని నుపయోగించుటను గూడఁ దెలిసికొని యుండిరనియు, (౬) యానపాత్రములను నీటిపై నడపుటఁ వారికి దెలిసియుండెననియు; (౭) ఔషధసేవనమువలనను చికిత్సాపూర్వకముగను వ్యాధి నివారించుకొనుటకు వారికిఁ దెలియుననియు; (౮) సూక్ష్మగణనానుసారముగ వారికి సమయ నిర్ధారణము చే

యుటయుఁ దెలిసియుండెననియు, (౯) మఱియుఁబథికజనుల యు
పయోగార్థమై సత్రములు మున్నగుఁగల వసతులను గల్పిం
చుచుండెడివారనియు, మనము తెలిసికొందుము. ఈమంత్ర
ములద్వార మన మింకను దెలిసికొనున దేమనగా (౧౦) క
న్యలు తమతండ్రియొక్క యాస్తిని బంచుకొనుటకు హక్కు
గలిగియుండిరనియు (౧౧) స్త్రీలు జనానాపద్ధతి నవలంబింపక
బహిరంగముగఁ బోవుచు వచ్చుచు నుండెడివారనియునే. ఇటు
వంటి నాగరికసంఘమునందు గురుతరమయిన పాపములుండిన
టుల నిదర్శనములుగూడ నామంత్రములందే ప్రాప్తమగుచు
న్నవి. వారాంగనల దుష్కార్యములును, జారజులు సంతాన
మును, రహస్యముగఁ బ్రసవించుటను గూర్చియు నుల్లేఖింప
బడియుండుటను నామంత్రములలోఁ జూడనగును. ఋగ్వేదము
లో నన్నివిషయములనుగూర్చి చెప్పఁబడియుండఁగా జాతిభేద
మును గూర్చి యేమైన చెప్పఁబడియున్నదా యని మీరు ప్ర
శ్నింపవచ్చును. ఋగ్వేదములో నొక్కస్థలమునందుఁ దక్క
మఱియెచ్చటను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు
మొదలగు జాతుల వివరణము లభింపదనియె దీనికి నుత్త
రము.

జాతిభేదమునుగూర్చి వివరింపఁబడిన యాకొంచెమయి
నను, ఏసూక్తమునందుఁ గలదో దానికి బురుషసూక్తమని
పేరు. దేవతలందఱును నొక యాశ్చర్యమగు ప్రకృతిసంపన్నుఁ

డగు పురుషుని యజ్ఞమునందు బలిచేసిరని యీసూత్రము
నందుఁ జెప్పఁబడియున్నది. ఆపురుషునియొక్క దేహమునుం
డియే సృష్టియొక్క పదార్థమాత్రయు నుత్పన్నమయినది. నా
నాప్రకారములగు పదార్థముల సృష్టిని వర్ణించి కడపట నీవిధ
ముగ నాసూక్తము చెప్పుచున్నది:—

"తస్మాత్ యజ్ఞాత్సర్వహుతః ఋచః సామానిజజ్ఞిరే।
ఛందాంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత । తస్మాద
శ్వా అజాయన్త యేకేచోభయాదతః । గావోఽహజజ్ఞిరే త
స్మాత్ తస్మాజ్జాతా అజావయః॥ * * *

"బ్రాహ్మణోస్యముఖ మాసీత్ బాహూరాజన్యః
కృతః, ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజా
యత॥"

అర్థము:—"ఆసర్వహుతమగు యజ్ఞమునుండియే ఋ
క్కులును, సామములును జనించినవి దానినుండియే ఛందము
లును, అనగా వేదములన్నియును, యజుర్వేదమును నుత్ప
న్నమయినవి. దానినుండియే గుఱ్ఱములును, రెండువరుసల దం
తపశిష్టములగు నితర ప్రాణులును, గోవులును, మేషములును,
అజములు మున్నగునవి యుత్పన్నమయినవి. * * * దాని
యొక్క ముఖమే బ్రాహ్మణులయిరి; బాహుద్వయములు

క్షత్రియరూపమునఁ బరిణతమయ్యె; వైశ్యులూరువులుగను మఱియు పాదద్వయమునుండి శూద్రు లుత్పన్నమయిరి.”

ఋగ్వేదములోని పూర్వోక్తసూక్తముయొక్క భాషనుఁ జూచి సామాన్యముగ సంస్కృతము తెలిసినవారు, ఆ భాష యాధునిక సంస్కృతమని తెలిసికొనుచున్నారు. ఋగ్వేదములోని యితరమంత్రముల భాష యాధునిక సంస్కృతమునకు సంబంధించి యుండదు. టీకాకారుల సాహాయ్యమును విశేషముగాఁ బడసియు, వానియొక్క యర్థమును బోధపఱచుకొనుట యతిదుష్కరము. వానియొక్క వ్యాకరణము వేరు; ఛందము వేరు, మఱియు వానిలోని యధికాంశములగు శబ్దములు వర్తమానసమయమున నప్రచలితములు. దృష్టాంతమునకై ఋగ్వేదమునందలి ప్రథమశ్లోకమునుఁ జదువుఁడు.

“అగ్నిమీళే పురోహితం యజ్ఞస్యదేవ మృత్విజం, హోతారం రత్నధాతమం.”

ఆధునికసంస్కృతము నెఱింగినవారెవ్వరును నీమంత్రముయొక్క యర్థమును టీకాసహాయములేక గ్రహింపఁజాలరు. ఋగ్వేదములోని యధికాంశములగు మంత్రముల భాష నీవిధముగ దుర్బోధ్యమయి యున్నది. కాని పురుషసూక్తమునుండి యేభాగ ముద్ధృతముగాఁబడినదో, యది యాధునిక సంస్కృతనియమానుయాయియగుటచే సుబోధకముగనున్నది.

దీనినిబట్టియె యెవఁడయినను నీభాగము తక్కిన మంత్రములకంటె (ఎక్కువ గడచినకాలమున) విశేషకాలమునకుఁ దరువాత రచియింపఁబడి యుండవచ్చునని యనుమానపడవచ్చును. వేదములను ముద్రించినట్టి మోక్షమూలరు ప్రభృతిపాశ్చాత్యపండితులును, వేదాంగముల నెక్కువగఁ బరిశీలించుటలో నిరతులయినవారును నీభాగము ఋగ్వేదమునందు బహుకాలమునకుఁ బిమ్మట ప్రక్షిప్తము గావింపఁబడినదని స్థిరపరచియున్నారు. సంస్కృతజ్ఞులగు పాఠకులీయుద్ధృతభాగమునుండియే మఱియొక్క యభ్యంతరీణప్రమాణమును బడసియున్నారు. ఈసూక్తమునందే, యీదేవయజ్ఞమునుండియే, ఋగ్వేదమును సామవేదమును ప్రసూనమైనటులఁ జెప్పఁబడియున్నది. దీని మూలముగ మనకు నీమంత్రమును రచించినవారు వేదవిభాగమయిన తరువాతను, అనగా వేదమంత్రము లన్నియు సంగ్రహీతమై, ఋక్, సామ, యజుస్సులని శ్రేణీభుక్తమయిన తరువాత నీభాగమును (పురుషసూక్తమును) రచించి ప్రక్షిప్తము చేసినటులఁ దెలియుట లేదా? మఱియును నిది మన్వాదిస్మృతికర్తల యభ్యుదయమునకుఁ బూర్వమును, మహాభారతము వర్తమానాకారముగ వ్రాయఁబడి యుండుటకుఁ బూర్వమును నీసూక్తము రచింపఁబడి యుండవచ్చుననియు స్పష్టమగుచున్నది. కారణ మేమనఁగా మన్వాదిగ్రంథములందును, మహాభారతమునందును నీసూక్తముల్లేఖితమగుటచే జాతిసృష్టిని గూర్చిన యీ

వివరణముయొక్క ప్రతిధ్వనినే యాగ్రంథములలోఁ జూడనగును.

హారీతస్మృతిలో నొకస్థానమున నీవిధముగ నున్నది:—

“విధినా పురుషసూక్తస్య గత్వా విష్ణుం సమర్చయేత్.”

పురుషసూక్తమునందుఁ జెప్పఁబడిన విధి ననుసరించి విష్ణువు నర్చింపవలయును. మనువు జాతిభేదయుత్పత్తి విషయమై యీవిధముగఁ జెప్పియున్నాఁడు:—

“లోకానాంతు వివృద్ధ్యర్థం ముఖబాహూరుపాదతః ।
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రంచ నిరవర్తయత్ ॥”

ఈశ్వరుఁడు లోకముయొక్క వృద్ధినిమిత్తము ముఖము, బాహువులు, ఊరువులు, పాదద్వయములనుండి, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను బ్రకాశింపఁజేసెను.

మహాభారతమునందు నీజాతిసృష్టి వివరణముయొక్క ప్రతిధ్వని గానవచ్చుచుండును:—

“పురూరువాచ, కుతశ్చిత్ బ్రాహ్మణో జాతో, వర్ణాశ్చాపి కుతస్త్రయః । కస్మాచ్చభవతి శ్రేష్ఠస్తన్మే వ్యాఖ్యాతుమర్హసి । మాతరిశ్వోవాచ । బ్రాహ్మణో ముఖతః సృష్టో బ్రహ్మణో రాజసత్తమ । బాహుభ్యాం క్షత్రియః సృష్ట ఊరుభ్యాం వైశ్య ఏవచ । వర్ణానాం పరిచర్యార్థం త్రయాణాం

భరతర్షభ, వర్ణశ్చతుర్థం సమ్భూతః పద్భ్యాం శూద్రో వినిర్మితః”—(మహాభారతము, శాంతిపర్వము.)

పైదాని కర్థము:—“పురూరవుఁడు ప్రశ్నించుచున్నాఁడు—బ్రాహ్మణుఁ డెచటినుండి యుత్పన్నుఁ డయ్యె? మఱియుఁ దక్కిన మూఁడువర్ణములు నేవిధముగ సృష్టింపఁబడినవి? ఇంకను, ఎందుచేత బ్రాహ్మణుఁ డందఱికంటె శ్రేష్ఠుఁ డయ్యెను? అదంతయును ననుగ్రహించి చెప్పఁడు.” ఓరాజోత్తమ! బ్రాహ్మణుఁడు బ్రహ్మయొక్క ముఖమునుండి సృష్టింపఁబడెను. బాహుద్వయమునుండి క్షత్రియులును, ఊరువులనుండి వైశ్యులును సృష్టింపఁబడిరి. మఱియు నోభరతర్షభ, పూర్వోక్త త్రివర్ణములవారి పరిచర్యార్థమై చతుర్థవర్ణమగు శూద్రులు పాదద్వయమునుండి నిర్మింపఁబడిరి.” ఈ సముదయ వచనములన్నియుఁ బూర్వోక్త పురుషసూక్తమునఁ జెప్పఁబడిన రీతినే వ్రాయఁబడియున్నవి. కాని పురుషసూక్తమునందలి యీభాగము ఋగ్వేదమునందలి యితర మంత్రములకంటె నతి యాధునికమని యిదివఱకుఁ జెప్పఁబడియున్నది. కావున నీజాతిభేదమే నితాంతమైన యాదిమకాలముననుండి యుండినయెడల, నదియొకవేళ ప్రాచీనతమమగు నార్యసంఘమున నొకవిశేషయాచారమై యుండినయెడల, ప్రాచీనమంత్రములలో దీనినిఁగూర్చి యేదో యొకవిధముగ వర్ణింపఁబడియే యుండునని మనకు సహజముగఁ దోఁపవచ్చును. ఏవిధముగ ఋత్విజులు యజ్ఞము

ను జేయుచుండిరో, ఏవిధముగ జ్యోతిర్విదులు నక్షత్రములను గనుఁగొనుచుండిరో, ఏవిధముగా నాకాలమున నార్యులు కాలనిర్ధారణముఁ జేయుచుండిరో, ఏవిధముగఁ గృషికులు కృషికార్యములు నెఱవేర్చుచుండిరో, ఏవిధముగఁ గులస్త్రీలు, యవ, గోధూమమాదిధాన్యములఁ గాపాడుకొనుచుండిరో, ఏవిధముగ వణిజులు వర్తకము చేయుచుండిరో, మొదలగు ప్రాచీనత మార్యసంఘమునందలి నానావిధములగు నాచారములను గూర్చియు, రీతినీతులను గూర్చియు మంత్రము లుద్ఘోషించుచుండ, సామాజిక సకలాభ్యంతరీణకథనము లామంత్రములలోఁ బ్రాప్తమగుచుండ జాతిభేదమువంటి యొక ప్రధానాచారమును గూర్చి యేప్రశంసయు లేకయుండుట సంభవమగునా? ఈకారణముచేతనే వర్తమానకాలమున నాచారముగనున్న జాతిభేదము భారతవర్షమున నార్యులు ప్రవేశించినతరువాత బహుకాలమునకుఁ గ్రమక్రమముగా వాడుకలోనికి వచ్చియుండునని పండితు లనుమానపడుచున్నారు.

ఇంకను నతిప్రాచీనతమకాలమునందు వర్ణభేదము లేదనుటకు నీవిధమగు ప్రమాణములును శాస్త్రములందుఁ జూడఁగలము. మహాభారత శాంతిపర్వమునందు

"నవిశేషోస్తి సర్వం బ్రాహ్మమిదం జగత్ ।
బ్రహ్మణా పూర్వసృష్టంహి కర్మభిః వర్ణతాంగతం॥"

అర్థము:—వర్ణభేదము లేదు, సమస్తజగత్తునందును ఒక్క బ్రాహ్మణజాతిమాత్రమే బ్రహ్మచే పూర్వము సృజింపఁబడెను. అటుతరువాతఁ గర్మలయొక్క విభిన్నతావశమున వర్ణములయొక్క విభిన్నతయు నేర్పడెను." అని చెప్పఁబడియున్నది.

ఇందువలన నిక్కాలమునందలి జాతిభేదాచారము కర్మల విభిన్నత్వముచే నభ్యుదితమైనదని తేలుచున్నయది. ఋగ్వేదమంతయును బూనికతో సమగ్రముగఁ జదివినఁగూడ నీవిషయమే తేటపడఁగలదు. ఋగ్వేదమునందలి మంత్రముల నన్నిఁటినిఁ జదివిన, అన్నిచోట్లను "ఆర్యులు" మఱియు "దస్యులు" అను నీయిరుతెగలవారి పేర్లుమాత్ర ముల్లేఖింపఁబడియుండుటను జూతుము. "ఓయింద్ర! నీశుభ్రవర్ణులగు స్నేహితులకుఁ దోడ్పడుము. మఱియు నల్లని దేహచ్ఛాయగలవారిని నిశ్శేషము చేయుము" అని మంత్రకర్త లతియాగ్రహపూర్వకముగఁ బ్రార్థన చేసియుండిరి. ఇంద్రుని ప్రశంసించుచు "సుశిప్ర" అనఁగా "శోభననాశికాయుక్తునిగ" సంబోధించి యుండిరి. మఱియు దస్యులని యెవరు వర్ణింపఁబడుచు వచ్చిరో, వారిని 'నాసికవిహీనులు' గను, 'మేకలవలె నాసికముగలవారి' నిగను, 'ఆమమాంసాశనులు' గను వసహ్యసూచకములగు మాటల నుపయోగించుచు వచ్చిరి. ఈమాటల నన్నిఁటిని నొక్కచోఁ జేర్చి పరిశీలించి చూచిన, నేకాలమున

నావేదమంత్రము లన్నియు రచియింపఁబడినవో యాకాలమున
భారతసమాజమున నిరుశ్రేణులగు మానవు లుండిరనియు,
అందులో నొక శ్రేణివారు గౌరవర్ణముగలిగి, శోభననాసికా
యుతులును, బక్వమాంసాశనులును, మఱియొక తెగవారు కృ
ష్ణవర్ణులును, ఛాగనాసికావిశిష్టులును నగు నామమాంసాశనుల
నియు సిద్ధాంతము చేయుటకు వీలులేదా? ప్రథమశ్రేణివారు
తా మార్యులమని చెప్పుకొనుచు తదితరులగువారు దస్యులని
యు లేక దాసులనియు వర్ణించుచు వచ్చిరి. మఱియు నీ రెండు
తెగలవారికిని నెల్లప్పుడును వివాద ప్రతివాదము లుండినటుల
ను బ్రతిపన్నమగుచున్నవి. అటులఁ గాదేని దస్యులయొక్క
విచ్ఛేదమునకై యింద్రాదిదేవతలను నార్యులు స్తుతించుటలో
నభిప్రాయమేమి? అంతియెగాక, దాసులు లేక దస్యులనఁ బర
గెడివారలలో కొందరు పర్వతపృష్ఠభాగములను లేక వనాభ్యం
తరములను నాశ్రయముగాఁ జేసికొని నివసించుచుండినట్లు ఋ
గ్వేదమంత్రములవలనఁ దెలియుచున్నది. ఒకస్థానమున మంత్ర
కర్త "ఉతదాసంకౌలితరం బృహతః పర్వతాదధి" అనగా
దాసులను గొప్ప పర్వతములనుండి దొర్లింపుమని చెప్పియు
న్నాఁడు. ఇందువలన దాసులగువారలలోఁ గొందరు పర్వతా
దులయందు వాసము చేయుచుండిరనియుఁ దోఁచుచున్నది.

ఇఁక మీఁదు మనోయోగపూర్వకముగ నాలోచనము
చేయుఁడు. ప్రాచీన భారతసమాజమున రెండు తెగలవారికిని

సంగ్రామము జరుగుటను జూడుఁడు. వీరొక్క జాతివా రెవ్వ
డును గారు, ఏలనఁగా వారివర్ణమును నాకృతిగతవిశేషవైష
మ్యమును దృష్టమగుచున్నది. కావున వారెవరై యుండవ
చ్చునని మీ రిప్పుడే ప్రశ్నింపవచ్చును? ఈగౌరవర్ణజాతియొ
క్క పూర్వపురుషులు మధ్యాసియాలోని యేదో యొక
హిమప్రధానమైన భాగమున వసించుచుండి మానవై తివృ
త్తముయొక్క యేయనిర్దిష్టకాలముననో, అనిర్దిష్టకారణముల
చేతను నివాసభూమిని వదలి భారతవర్షమునందలి సువిఖ్యా
తమగు బ్రహ్మర్షి దేశమునందలి సప్తనదీప్రాంతమును జేరి
యచ్చట నుపనివేశస్థులయిరని పండితులగువారు బహుతర
గవేషణద్వార నిర్ణయించియున్నారు. ఈ యార్యసమాగమ
కాలమునాటి సంఘటనము లన్నియు మానవస్మృతియొక్క
పూర్వతన యజ్ఞానంధకారమున విలుప్తమయినవి. కేవలము
ఋగ్వేదములోని ప్రాచీనతమములగు మంత్రములనుండి మా
త్రమే యక్కడక్కడ వారియొక్క యాభాసమును మాత్రము
తెలిసికొనగల్గుచున్నారము. అయిన నేవిధముగ వర్తమాన
మందలి జనసంఘముల నన్నిఁటిని బరిదర్శనముచేసి ప్రాచీన
సంఘములయొక్క వికాసప్రక్రియలను నిర్ధారణముఁ జేయుచు
న్నారమో, యాతీరుననే యాధునిక జాతులవారి చరిత్రములను
జూచి ప్రాచీనజాతుల యితిహాసమును నిరూపణము చేయవల
సియుండును. మనము మఱియొకతూరి జగత్తునందలి యపరా

పరజాతులవారి యితివృత్తములనుఁ జూతుమేని, అసభ్యులగు జాతివారిమధ్య నపేక్షాకృతాధికసభ్యులగు జాతివారు ఉపనివేశము స్థాపించినపు డేమి పొసగుచుండుటను మనము జూతుము? నవాగత శత్రువులు వచ్చినంతమాత్రమున నాదిమనివాసులకును వారికిని విరోధము సంఘటిల్లుటయును, ఆసంగ్రామమున నోటువడిన యాదిమవాసులలోఁ గొందరు విజయము నొందినవారి దాసత్వమున కొప్పుకొని వారిపరిచర్యకై నియుక్తులగుటయును, నెమ్మదిగ నుండుటకన్న నెక్కువ మూల్యమగు స్వాతంత్ర్యము నెక్కువ పరిగణించు మఱికొందరు సర్వస్వాపహారులగు ప్రబలశత్రువుల దాసత్వమును మెడకుఁ దగిలించుకొనుటకంటె గిరిపృష్ఠభాగములనో లేక నిర్జనవనములనో యాశ్రయముగఁ జేసికొని మృగయాజీవనులగుటయె శ్రేయమని తలఁచి వారు గిరిశృంగములయందును లేక విజనారణ్యభూములందును దురారోహ్యమును, దురాక్రమ్యమునగు స్థానముల నాక్రమించుకొని తమ స్వాతంత్ర్యములను గాపాడుకొనుచుండుటయును మనముచూతుము.

ఇంగ్లాండుదేశచరిత్రమును జూచిన నిదియే స్పష్టమగును. సాక్సను లింగ్లాండుదేశమునకు వచ్చి యుపనివేశనము స్థాపించినప్పు డచ్చటేమి సంఘటిల్లెను? బ్రిటనులోని యాదిమనివాసులకును వారికిని విరోధము సంభవించిన సంగతి యందరి

కిని విశదమే. ఆసమయమునఁ బరాభూతులయిన యాదిమ నివాసులలోఁ గొందఱు జేతలయొక్క దాసత్వమున కొప్పుకొని కేవలము క్రీతదాసులవలె విజయము నొందినవారి గృహములలోఁ బరిచర్యచేయుటకు సమ్మతించిరి. మిగిలినవా రందరును వేల్సు, స్కాట్లండు మొదలుగాఁగల దురారోహ పర్వతశృంగముల నాశ్రయముఁ జేసికొనిరి. పురాతన గ్రీసుదేశమునందును సరిగా నిదేవిధమున జరిగెను. ఎప్పుడు లెసిడిమోనియనులు దళములుగా వచ్చి స్పార్టాప్రదేశమున నుపనివేశనమును స్థాపించుకొనిరో, అప్పు డాదిమనివాసులలోఁ గొందరు దాసత్వమున కొప్పుకొని హెలట్ లేక దాసులుగను బరిణమించిరి. మిగిలినవారందరును మెస్సినాప్రదేశమందలి పర్వతప్రాంతములను, వనములను జేరి ప్రాణరక్షణముఁ జేసికొనిరి. నాగరికాగ్రగణ్యమగు నమెరికాదేశపువైపు చూడుఁడు. అచ్చట శ్వేతకాయులగు నూరోపీయను లుపనివేశనమును స్థాపించి మూఁడునాలుగు వందల సంవత్సరములకంటె నెక్కువకాలేదు. అక్కడ నాదిమనివాసుల గతి యేమయినది? వారలలో నెక్కువ శాంతిప్రియులుగ నుండువారు జేతలయొక్క దాసత్వమున కంగీకరించి వారి గ్రామములందును జనపదములందును నాశ్రయము పడసిరి; ఇఁక స్వాతంత్ర్యమును బ్రియతమమయినదిగా భావించినవారు, జనసంచారరహితమగు విజనారణ్యప్రదేశములనో లేక దుర్లంఘ్యములగు నాండీసుగిరి కందరములనో యాశ్రయము

గఁ జేకొనిరి. భారతవర్షమునందును నిదేతీరున సంఘటిల్లెను. ఆర్యు లెప్పుడు సప్తనదీతీర దేశమును నాక్రమించుకొనిరో, అప్పుడు దేశమునందలి యాదిమనివాసులతో వారికి ఘోరమైనపోరాటము గల్గెను. ఆసంగ్రామమున నార్యులు జయమును బొందుటచే వారియొక్క ప్రభుత్వమును, రాజత్వమును స్థిరపడెను. ఆదిమనివాసులలోఁ గొందరుమాత్రమే జేతలను బాధపెట్టుటకు నారంభించిరి. ఎవరు దాసత్వమును స్వీకరించిరో వారే దాసులు. ఇఁక నెవ రెదురు తిరిగి వారలకు నుపద్రవమును గలుగఁజేసిరో వారె 'దస్యుల'ని పిలువఁబడుచు వచ్చిరి. కాని యీ యిరుతెగలవారును నొక్క జాతివారే; వీరే భవిష్యత్కాలమునందలి శూద్రులు.

శూద్రజాతి యెటుల సృష్టింపఁబడినదో మీరు చూచితిరి. యుద్ధక్షేత్రమునందు బందీలుగా చేయఁబడినవారును, రణమునందుఁ బరాజితులయి జేతలయొక్క శరణముఁ జొచ్చినవారును క్రీతదాసులుగఁ బరిగణింపఁబడుట పూర్వకాలమునందన్ని దేశములలోను నాచారమైయుండె. తరువాత నట్టివారిని బశుప్రాయులనుగాఁ జూచుటకునయిన వారల మనస్సు కంటగించునది కాదు. పశువులవలెనె వారిని దానము చేయుటకును, విక్రయించుటకునుఁ గూడ ప్రభువుల కధికార ముండెడిది. వారియొక్క ప్రాణముపై నెవరికిఁగాని మమత యుండునదిగాదు. విశేషముగ బంధీకృతులయిన దాసులు సభ్యతాంశమున హీ

నులయినను వారిమాటయిన ననుకొనువారు లేరు. వారల ప్రభువులు వారిని సరిగాఁ బశువులవలెనే భావించుచుందురు. ఈ విధముగఁ బూర్వపు రోమునగరమున సంవత్సర సంవత్సరమును అసభ్యజాతులగు పురుషులును స్త్రీలును ఖైదీచేయఁబడి తేఁబడుచుందురు. అట్టివారిని రోమునగరపు సంభ్రాంతజనులు బజారునఁ గొనుచుందురు. మఱియుఁ దమతమ గృహములలో నతినీచములగు కాయకష్టములను గలుగఁజేసి పరిచారికమునందు నియోగింతురు. అప్పుడప్పుడు పట్టణమునందలి జనుల వినోదార్థమై సింహ వ్యాఘ్రాది హింస్రశ్వాపదముల నోటఁ బడవేయుటయును గలదు. వీరు భయంకరమగు సమయములలో రక్తాక్తులయి యెపుడు జంపఁబడుదురో యప్పుడు సమాగతులయిన నగరవాసులు నలువైపులనుండియుఁ గరతాళధ్వనులఁ జేసి యానందించుచుందురు. పరాజితమానవులయెడఁ బూర్వకాలమిట్టి దుండగములు నెఱపఁబడుచుండెడివి.

భారతవర్షమునఁ గూడ దీనికి భిన్నముగాఁ జరుగలేదు. ఆదిమనివాసులలో నెవరు ఆర్యజేతలయొక్క దాసత్వముఁ గొప్పుకొనిరో వారు శీఘ్రముగనే యన్ని విధములగు సామాజిక స్వాతంత్ర్యములనుండి వంచితులై క్రీతదాసులయిరి. ఇఁక వారి స్వజాతీయులగు, పర్వతకందరముల నాశ్రయించుకొనినవారన్నno చలమువహించి యార్యజనుల నుపద్రవపెట్టుటకుఁ బ్రారంభించిరి. ఇది యితిహాసములందుఁ గ్రొత్త విషయముకాదు.

అమెరికాదేశమునందలి యౌపనివేశకులపై ఆదిమనివాసులగు నిం
డియనులు జరుపు నుపద్రవములను, జ్ఞప్తికిఁ దెచ్చికొనినఁ
జాలును.

ఒకపర్యాయ మిపుడు తత్కాలమునందలి యార్యసం
ఘముయొక్క స్థితినిఁ గల్పనాపూర్వకముగఁ జిత్రించుటకుఁ బ్ర
యత్నింపుఁడు. ఒకవైపున దీర్ఘాకృతిగలిగి గౌరవర్ణులును, ఉ
న్నతనాసికవిశిష్టులగు విదేశీయులు పంచనదీప్రాంతమున నుపని
వేశమును స్థాపించి బాహుబలముచే నోడించిన దేశమున గ్రా
మములును, జనపదములును నిర్మాణమును జేసికొనుటయును,
కృషివాణిజ్యముల కనువగు నేర్పాటులను జేయుటయును, అర
ణ్యముల నన్నిఁటిని నిశ్శేషముగా మార్చి మనోహరమగు కృషి
క్షేత్రములను విస్తరించుటయును, ఉపనివేశికుల ప్రాంతవర్తి
యగు నరణ్యభూములను మృగయార్థమై పర్యటనము చేయుట
యును, వారియొక్క యజ్ఞాగ్నిని బ్రజ్వలింపఁజేసి దానిలో హో
మము చేయుటయును జూడుఁడు. మఱియొకవైపునఁ బరాజితు
లగు నాదిమనివాసులు పర్వతాదుల నాశ్రయముగఁ జేసికొని
నిరంతరము వారికి నుపద్రవమును గలుగఁజేయుటయును జూ
డుఁడు. ఆర్యుల కేపనులు చేసినఁ గష్టముగ నుండునో యవ
న్నియు నసభ్యులగు దస్యులు చేయుచుండెడివారు. ఆర్యులు
వారి నామమాంసభుక్కులని యసహ్యపడుచుండెడివారు. ద
స్యులన్ననో యార్యుల యజ్ఞక్షేత్రములయం దాడు మాంస

ఖండములు వర్షించుచుండెడివారు. ఇంకను హఠాత్తుగ నెవ
రైన నార్యరమణులు మార్గమునఁ గనఁబడిన వారి నెత్తుకొనిపో
వుచుండెడివారు. ప్రాచీన పురాణములయందు ఋషులపై రా
క్షసు లెట్లు దుండగములను జరపినటుల విందురో యవన్నియు
నీపై కనిన దుశ్చేష్టలయొక్క వివరణమే యగును.

ఎట్లుండినను, దస్యులగువా రెపుడు ప్రతినియతులై
యార్యుల నుపద్రవ పరుపనారంభించిరో, యెపుడు వారు కష్ట
పడి సంపాదించికొనిన యన్నమును సుఖముగఁ గుడిచి సుఖమ
నుభవించుట దుష్కరమయ్యెనో, అప్పుడు ఆర్యులు ఆత్మరక్ష
ణార్థ మెక్కువ శ్రద్ధతీసికొనవలసి వచ్చెను. వారలలో సబల
కాయులై, సాహసవంతులును, సమరకుశలురు నగువారి నే
ర్పఱిచి వారి గ్రామములయొక్కయు, జనపదముల యొక్క
యుఁ బ్రాంతభాగములనుండి యారంభించిరి. ఆవిధముగ నుం
పఁబడినవారు శస్త్రపాణులై తమ యధికారమునకు లోఁబడిన
ప్రదేశములయందు వాసము చేయుచుండిరి. వీరే క్రమముగా
క్షత్రియులుగాఁ బరిణమించిరి. క్షత్త్రశబ్దమునకు అర్థము క్షయ
మునుండి రక్షింపఁగలవారనియె. ఈయర్థముతోఁ బాటు వారి
నిఁగూర్చి వర్ణింపఁబడిన ఘటనావళులను గూడ పోల్చిచూచిన
మిక్కిలి చమత్కారముగనుండు. ఈ క్షత్రియులు పూర్వ మ
విభక్తార్యసంఘములోనివారు. అప్పుడు బ్రాహ్మణులు క్షత్రి
యు లనెడి భేదమే యుండునదిగాదు. కర్మభేదము ననుసరించి

యే యీ భేదము లన్నియు నుత్పన్నము లయినవి. పూర్వ మొక్క జాతిమాత్రమే యున్నట్లును, ఆజాతినుండియే క్షత్రియు లేర్పడినటులను మహాభారతమునుండి ప్రమాణము చూపఁబడియున్నది. మఱియు బృహదారణ్యకోపనిషత్తునుండియు మఱియొక ప్రమాణ మీక్రిందఁ జూపఁబడినది.

“బ్రహ్మవాఇదమగ్ర ఆసీత్ ఏకమేవ, తదేకం సత్ నవ్యభవేత్ తచ్ఛ్రేయోరూపం అత్యసృజత క్షత్రం”

అర్థము—“మొట్టమొదట నొక బ్రాహ్మణజాతిమాత్రమే యుండెను. ఈజాతి యొంటరిగా వృద్ధిపొందలేదు, కావున నా శ్రేష్ఠవర్ణులు క్షత్రియులను సృష్టించిరి.” వేదములను స్మృతులను నేమాత్రమయిన జదివినవారు, “బ్రహ్మ” శబ్దమును “బ్రాహ్మణ” అను అర్థమిచ్చునటుల గొప్పగొప్పస్థలముల నుపయోగింపఁబడి యుండుటను దెలిసికొందురు. ఇచ్చట “బ్రహ్మ” శబ్దమునకు బ్రాహ్మణులనియే యర్థము. ఉపనిషత్తు లతిప్రాచీనగ్రంథములు. ఈదేశమునందవి వేదములనియే గౌరవింపఁబడుచున్నవి. కావున నేను వివరించిన జాతిభేదముయొక్క యుత్పత్తికిఁ బ్రమాణము వేదములనుండియే కనుబరచియున్నాను.

ఇఁక నేవిధముగఁ బ్రాచీనపు టార్యసంఘమున వైశ్యులును, శూద్రులు ననెడి రెండుజాతు లేర్పడినవో చూడుఁడు.

మిగిలిన యార్యులందరు నేమిచేసిరని యొక ప్రశ్న యుదయింపవచ్చును. వారిమధ్య కొందఱి నొక గురుతరకార్యమున నియుక్తులం జేసిరి. ఆకార్య మేదన, ఎప్పుడు వేదములలోని ప్రాచీనమంత్రము లన్నియు రచియింపఁబడినవో, అప్పుడు వారు వ్రాయుటకు నేర్చియుండలేదనియు, ఆకారణమున వారామంత్రముల నన్నిఁటినిఁ గంఠస్థముగఁ జేసికొని యుండిరనియు మీకుఁ దెలిసియేయున్నది. ఆర్యులు భారతవర్షమును బ్రవేశించుటకుఁ బూర్వమునుండియు, సోమయజ్ఞమును వారలలో నగ్నిని నుపాసించుటయును బ్రచలితముగ నుండెను. వర్తమానకాలపు పారశీలయొక్క ప్రాచీన ధర్మశాస్త్రములలో నీవిషయమును గూర్చి వ్రాయఁబడియుండుటను మనము కందుము. వర్తమానపు హిందువులయొక్కయు, వర్తమానపు పారశీలయొక్కయుఁ బూర్వపురుషులు మన హిందూదేశమునఁ బ్రవేశించుటకుఁ బూర్వ మొక్కటిగా వసించుచుండిరని పండితులందరును బ్రభూతమగు గవేషణముద్వార స్థిరపఱిచియున్నారు. కావున నగ్న్యుపాసనాద్యాచారములు అప్పటి కాలపు టాచారములయి యుండవలెను. ఏదియెట్లున్నను మిక్కిలి పురాతనమునుండియు నగ్ని నారాధించుటయును, దదర్థమై రచింపఁబడిన మంత్రములును మన దృష్టిగోచరమగుచున్నవి. ఆర్యులెపు డత్యున్నతగిరి మండితమై, బహునదపరిధౌతమై, సస్యశాలినీ శ్యామలక్షేత్ర పరిపూర్ణమై యలరారుచుండిన భారత

పుణ్యభూమియందుఁ జొచ్చిరో, అపుడు వారీదేశమునందలి ప్రాకృతిక గాంభీర్యమును మనోహరభావములను సందర్శించునపుడు వారి హృదయములందలి కవిత్వానైపుణ్యము సమధిక భావమున నావిర్భవింపసాగెను. వారుషఃకాలమందలి నవోదిత సూర్యుని తరళకిరణచ్ఛటలచే ననురంజితమయిన సునీలాకాశమును జూచినపుడును, నిదాఘసమయమందలి తీవ్రతాపమునకుఁ దరువాతఁ బ్రావృట్కాలపు నవమేఘావళులచే నిండిన యాకసమును జూచినపుడును, గిరిపృష్ఠభాగములనుండి వన్యసమూహములచేఁ గల్లోలితమై ప్రవహించు జలరాసులను దిలకించినపుడును, వారి హృదయసాగరములం దపూర్వమగు భావతరంగములు లేవనారంభించెను. ఈరసపూరిత కవిత్వముయొక్క సంగీతలహరియే ఋగ్వేదము. ఇందులో నక్కడక్కడఁ గవిత్వముయొక్క సౌరభము వర్ణనాతీతము! వారికిఁగల ప్రాకృతిక సౌందర్యగ్రహణశక్తియో యద్భుతము! అందులోఁ బ్రదర్శింపఁబడిన మానవజీవితముయొక్క చిత్రమో యతిముగ్ధకరము! వేదమంత్రములను రచించిన కవులు వర్షకాలమునందలి కప్పలయొక్క బెకబెకయనెడి రవములయందు సహితమొక విధమయిన యపూర్వమాధుర్యము ననుభవించిరి. ఎట్లున్నను వారు భారతక్షేత్రమునందలి పుణ్యారణ్యములలోఁ బ్రవేశించి ధర్మానుష్ఠానమునకుం దొడంగిరో యపుడు వారిమంత్రములు దినదినమునకు నభివృద్ధినొందసాగెను. ఆకాలమునందు

వర్ణమాల సృష్టింపఁ బడని కారణమున నొక తెగవారు యత్నపూర్వకముగ నామంత్రముల నధ్యయనము చేయుచు జ్ఞాపకమునం దుంచుకొనవలసి యుండెను. వీరు బాల్యకాలమునుండియు మంత్రముల నన్నిఁటిని వల్లించుచుండిరి; యజ్ఞశాలలయందుఁ బారాయణము చేయుచు హోమకార్యములందుఁ దోడ్పడుచుండిరి. ప్రస్తుతకాలమందు సహా పల్లెలయందు బ్రాహ్మణ పండితులబిడ్డలు, అక్షర జ్ఞానము లేనివారయినను, సంస్కృతజ్ఞానమంతకంటెను శూన్యమయినప్పటికిని, వివాహాది శుభకార్యములందును, శ్రాద్ధాద్య శుభకార్యములందును నెరపఁబడవలసిన పూర్వాపరకర్మలయొక్క విధానమంతయును గంఠస్థము చేసియుండుటను మీరు చూచియేయుండవచ్చును. వారిని పితృశ్రాద్ధము చేయవలసిన రీతి యెట్లని యడిగినంత మాత్రమునఁ గొంచెమైనను దడువుకొననక్కఱలేకయే దానికి సంబంధించిన మంత్రములనన్నిటిని ననర్గళధారగా జెప్పఁగలరు. అర్థము తెలిసినను, తెలికపోయినను, స్వచ్ఛముగనుండినను లేకపోయినను, చక్కగా నొప్పజెప్పుటకుమాత్రము వారు నేర్చుకొనియుందురు. ఈకాలమునందు హిందూసంఘమున ధర్మానుష్ఠానము నెరపుటకై తోడ్పడునిమిత్తము, ఏవిధముగ దశకర్మాన్వితులగు బ్రాహ్మణులు కనుపించుచుందురో, ఆవిధముగనే ప్రాచీనార్యసంఘమునందుఁ గూడ వేదమంత్రముల నన్నిఁటిని గాపాడి, యితరులకు బోధించునిమిత్తమై యొక తెగ

మనుష్యులు నియమింపఁబడియుండిరి. వీరే యుత్తరకాలమున బ్రాహ్మణులుగాఁ బరిగణింపఁబడిరి. బ్రాహ్మణశబ్దమున కుత్పత్త్యర్థమేమనఁగా, బ్రహ్మమును తెలిసికొనినవారనిగాని లేక ధారణచేసినవారనిగానియే. ప్రాచీన సంస్కృతమునందు బ్రహ్మశబ్దమున కనేక యర్థములుండెడివి. ఒక యర్థమేమనఁగా ఈశ్వరుడని, రెండవయర్థము బ్రాహ్మణజాతియని, మూఁడవ యర్థము వేదమంత్రమని. ఇచ్చట బ్రహ్మశబ్దమునకు వేదమంత్రములనియె. వేదమంత్రముల నెవరు ధారణచేయుదురో వారే బ్రాహ్మణులు. మనువు చెప్పినదేమనఁగా:—

"ఉత్తమాంగోద్భవేత్ జ్యైష్ఠాత్ బ్రహ్మణశ్చైవ ధారణాత్ । సర్వస్యైవాస్య సర్గస్య ధర్మతో బ్రాహ్మణః ప్రభుః॥" (మను ప్రథమాధ్యాయము.)

ఉత్తమాంగమునుండి పుట్టుటచేత జ్యేష్ఠుడనియు, వేసమంత్రములను ధారణచేయుటచే బ్రాహ్మణులనియు వీరుసృష్టికిఁ బ్రభువులనియు, నిబంధనమేర్పడినది.

ఈవిధముగనే ప్రాచీనార్యసంఘముయొక్క యొక యంగము శస్త్రపాణులై, సంఘమును రక్షించుటయె తమ ముఖ్యధర్మముగఁ జేసికొనిరి; మఱియొక యంగము వేదమంత్రముల నితరులకు నేర్పుటయందు, వానిని గాపాడుటయందును నియతు

లయిరి. అప్పుడు సంఘమునందలి మిగిలిన బహుసంఖ్యాకులందఱును కృషివాణిజ్యములందు నియతులయి యర్థోపార్జనమునకుఁ గడంగిరి. వేదమునందు వీరినే "విశ" శబ్దమునఁ జెప్పఁబడియున్నది. ఆధునిక బాంగాళిభాషలో "సాధరణప్రజా" యని యెవరివిషయమై యీరెండుపదముల నుపయోగింతుమో, అతీరున వేదమంత్రములలో "విశ" శబ్దమునకును నర్థమైయుండునని తోఁచుచున్నది. "విశ" అనఁగా ప్రజావర్గము. ఈకారణముననే "విశాంపతిః" అనఁగా బ్రజావర్గమును బాలించువాఁడు గనుక రాజని యర్థమిచ్చుచున్నది.

ఏవిధముగ ననివార్యములగు కారణములచే నాదిమయార్యసమాజమున నలు తెఱంగులగు జాతులేర్పడినవో చూచితిరా? మొదట భిన్న భిన్న శ్రేణులవారు భిన్నములగు కార్యములను నిర్వహింపఁ బూనుకొనివను, జాతిభేదముయొక్క చిహ్నములుగా నెన్నఁబడు ప్రధానమగు (1) తక్కువజాతివారి యన్నమును, జలమును స్వీకరించుట నిషేధము, (2) భిన్న భిన్నవర్ణములవారిలో వివాహము నిషేధము, (3) జాతిననుసరించి వృత్తియొక్క భిన్నత్వమును నిర్ణయించుటయను చిహ్నములు ఆదిమ ఆర్యసంఘమున నుండిన కొంతమాత్రమును గనఁబడదు. ఈసంకీర్ణభావమును, దత్ఫలితమగు నొండొరుల ద్వేషము మొదలగునవి సంఘమున నియమరూపముగఁ బరిణమించుట కనేక శతాబ్దములు పట్టెను. ఇంకను నీకాలమున జాతి

యేవిధముగ గుణమునుబట్టి కాక, జన్మగతముగనున్నదో యటుల పూర్వముండునది కాదని స్పష్టముగ నిరూపించుటకు శాస్త్రములందు గొప్పగొప్ప నిదర్శనములం బడయవచ్చును. మఱియు నుత్కృష్టవర్ణమువారు హీనజాతిత్వము పొందుటయు, హీనవర్ణమువారు, ఉత్తమవర్ణులగుటయు శాస్త్రములనుండియే తెలిసికొననగును. దీని కంతటికిని శాస్త్రములనుండి ప్రమాణములను ముందుముందు చూపెదను.

ఇపుడు మీ రొకవిషయమును జ్ఞాపకమునం దుంచుకొనుడు. వర్తమానకాలమున నాగరికసమాజమున నేయేవిధముగ సాధారణవిద్య వ్యాపించుటకై యేయనుకూలము లున్నవియో, అవి యాదిమ యార్యసంఘమున నుండునవి కావు. అనగా ఇపుడు మీరు, నేను, ఇంక మఱికొందరు, వారివారి శక్తికి తగినటుల అందరును వారి బిడ్డలను విద్యాశాలకు పంపుటయును, నలువైపులనుండి శతసంఖ్యాకులగు బాలురును, బాలికలును గూడి ప్రతిదినమును విద్య నభ్యసించుటయును గలవో ఆవిధముగ ప్రాచీన ఆర్యసంఘమున విద్యాలయము లుండినవిగావు. అపుడు విద్యార్థులను గురుకులములందు విడిచిపెట్టుట యాచారమైయుండె. గురువుల విషయమై గూడ యతికఠినశాసనము లుండినవి. వారు జీతమును పుచ్చుకొనగూడదు. మీదుమిక్కిలి శిష్యులకన్న వస్త్రాదులనుగూడ నొసంగి పోషింపవలసియుండె. శిష్యులు గురుగృహమున నివసించుచు, వారి గృహమునందుఁ బరిచర్య సేయుచు, దినములు గడపుచుండెడివారు. ఇప్పటివలె గ్రామగ్రామములందును అపుడు విద్యాలయము లుండునవి కావు. ముద్రాయంత్రములు లేని కారణమున, యెంతో కష్టముతో, యెంతయో పరిశ్రమతో విద్యార్థులు పూర్వకాలమున విద్యాభ్యాసము చేయవలసియుండె. కావున వ్యుత్పన్నముగల గురువులసంఖ్య యెక్కువగానుండునవిగావు. శాస్త్రవిశారదులని ప్రతీతిగాంచిన వ్యుత్పన్నులగు, గురువులవద్దకు మిక్కిలి దూరదేశములనుండియు విద్యార్థులాకృష్టులయి, అచటికిఁ జేరి వారితో వసించుచుందురు. ఇట్టి సందర్భమున యెవరి కేవిద్యయుండినదో వారు చిన్నతనమునుండియుఁ దమ వంశమునందలి బాలుర కావిద్యయే చెప్పుట స్వాభావికమయ్యె. మనుష్యుని కేవిషయమునందు ప్రతిష్ఠా గౌరవములు లభించుచున్నవో వానిని తనవంశమునందు కాపాడుకొనవలయునని యిచ్ఛ స్వతహాగా కలుగుచుండును. ఈయన్ని కారణములచేతను యీదేశమున నన్నివిద్యలును కులములననుసరించుకొని యుండునటుల తటస్థించె. ఇక్కడ నైయ్యాయికునిబిడ్డ న్యాయశాస్త్రవేత్తయే, స్మార్తునిబిడ్డ స్మార్తుడే, దివానుయొక్క కుమారుడు దివానే, వైద్యునిబిడ్డ వైద్యుడే. ఎవఁడేవిషయమునందుఁ బ్రతిభగాంచెనో, ఆతఁ డావిషయమునే తన వంశీయులకు నేర్పించుచుండెను.

మీకీ విషయమును జ్ఞాపకమునం దుంచుకొనినయెడల వర్తమానకాలమున జాతిభేద మెటు లేర్పడినదియు, మీ కవగాహమగును. ఎవరు సశస్త్రులై దేశ రక్షణార్థమునియుక్తులయిరో, వారుయుద్ధవిద్యయందు నిపుణులయిరి; ఆవిద్యయే వారి వంశపరంపరగా వచ్చుచుండె. ఎవరు వేదమంత్రములను గాపాడుచు, నితరులకు నేర్పుచుండిరో, వారును, ఆకార్యమునే కులవృత్తిగాఁజేసికొనిరి. ఇఁక నెవరు కృషివాణిజ్యాదులందు నివృత్తులగుచుండిరో వారును, వారి వారి బిడ్డలకుఁ దామునేర్చిన విద్యలనే నేర్పుచుండిరి. ఇపుడు మీకావశ్యకముగాఁ జూపవలసిన విషయమేమనఁగా ఏవిద్య యేవిధముగాఁగౌలికమైనదియో, అనఁగా నేది వంశమర్యాదనుగాపాడుకొనుటకొకయంగ స్వరూపమైనదో దానినే వారెప్పుడును యత్నపూర్వకముగా రక్షించుకొనుచుందురనియుఁ, దదుపరి ఇతరుల నాపని చేయనీయరనియే. మీకీవిషయమై సంఘము మధ్య ప్రతిదినము వేలకొలఁది దృష్టాంతములు కనుపించుచుండుటచే నీవిషయమును స్థాపించుటకై యిఁకఁదొందరపడవలసిన ప్రయోజనము లేదు. వేదమంత్రములను గాపాడువారు (బ్రాహ్మణులు) తమ కార్యముయొక్క ఘనతను, గౌరవము నెపు డుద్ఘోషింప నారంభించిరో, యెపుడుఁ దేశరక్షకులగు క్షత్రియులు తమ వృత్తినే ప్రశంసించుచుండిరో యపుడు మెల్ల మెల్లఁగా వీరిరువురికిని ప్రతిద్వందితాభావమును, విద్వే

షభావమును మొలకలెత్త నారంభించెను.; క్రమముగా, వర్తమానపుఁగఠిననియమములన్నియు నేర్పడెను.

మీరీవిద్వేషానలము ప్రధూమితమగుట స్వల్పకాలపు మాటగాదేయని ప్రశ్న చేయవచ్చును. అట్లు కాదేని చిరకాలానుగతమైన యీయాచారము బాగుగానాఁటుకొనుటకుఁ బూర్వము క్షత్రియులు బ్రాహ్మణులగుటయు, వారలలో బరస్పరమైత్రి కలిగి యన్యోన్యాహారవిహారాదుల కేయభ్యంతరములు లేకపోవుటయు, వివాహములు సయితము జరిగియుండినటులను మనకు నిదర్శనములు కనుపడవలయునేయని కూడ మీరు ప్రశ్నింపవచ్చును. దీనికి సమాధానముగా నేను గొప్ప గొప్ప ప్రమాణములను (దృష్టాంతములను) శాస్త్రముల నుండి చూపెదను. క్షత్రియుఁడగు విశ్వామిత్రుఁడు తన తపోమహిమచే బ్రాహ్మణుఁడయ్యెనని మీ రందరును నెఱిఁగిన విషయమేగదా! ఇంకను—

“ కారుషాత్ మానవాత్ ఆసన్ కరుషాఃక్షత్ర-జాతయః । ఉత్తరా-పథ-గోప్తారో బ్రహ్మణ్యాధర్మ-వత్సలాః ॥

శ్రీమద్భాగవతము. 9 వ స్కంధము 2 అధ్యాయము

అర్థము—మనువుయొక్క పుత్రుఁడైన కరుషిని నుండి కారుష సంప్రదాయ ముత్పన్నమయినది. వీరు క్షత్రియులు

వీరు ఉత్తర పథమునకు రక్షకులు, బ్రాహ్మణ్యులును ధర్మవత్సలులుగ నుండిరి. మరల

" పృషధ్రోపి హింసయిత్వాతు గురోర్గాం జనమేజయ।
శాపాత్ శూద్రత్వమాపన్నః "॥

హరివంశము 2 వ అధ్యాయము.

అర్థము—పృషధ్రుడను రాజు గురువుయొక్క గోవును జంపుటచే శపింపఁబడి శూద్రుడయ్యెను.

అథవాహరివంశమున—

" నాభాగారిష్టపుత్రౌ ద్వౌవైశ్యౌ
బ్రాహ్మణతాంగతౌ "।

నాభాగుఁడును, అరిష్ట పుత్రుడును వైశ్యులయ్యును బ్రాహ్మణత్వమునుఁ బొందిరి.

ఈవిధమున నింకను ననేక వాక్యములద్వార వర్తమానము నందువలె జాతిభేదమేర్పాటుకాఁబడుటకుఁ బూర్వమొక వర్ణస్థులు మఱియొక వర్ణస్థులుగా మారుచుండుటను జూపనగును. ఇఁకఁ బరస్పర వివాహవిషయములను గూర్చియు భోజన ప్రతిభోజనములఁ గూర్చియుఁ జెప్పనక్కఱయే లేదు. మనుసంహితకారుని సమయమునఁ గూడ నీక్రింద కనినరీతిని అనులోమవివాహములను గూర్చిన నియమములు లేవా?

" శూద్రైవభార్యా శూద్రస్యసాచస్వాచ విశఃస్మృతే।

తేచస్వాచైవ రాజ్ఞశ్చతాశ్చ స్వాచాగ్రజన్మనః॥

మను 3 వ అధ్యాయం.

అర్థము—శూద్రుడు కేవలము శూద్రకన్యను మాత్రమె వివాహము చేసికొనవలయును. వైశ్యుఁడు, శూద్రకన్యను, వైశ్యకన్యను గూడఁ బరిణయము చేసికొనఁగలఁడు; క్షత్రియుఁడు క్షత్రియకన్యను, మఱియు వైశ్య, శూద్రకన్యలను వివాహ మాడగలఁడు. మఱి బ్రాహ్మణుఁ డన్ననో నాలుగువర్ణములకు సంబంధించిన కన్యలను బెండ్లిచేసికొనవచ్చును. ఉచ్ఛజాతి పురుషుఁడు నీచజాతి కన్యను వివాహమాడుటకే అనులోమవివాహమనియు, ఉచ్ఛజాతీయ కన్యను నీచజాతిపురుషుఁడు వివాహమాడుటయే ప్రతిలోమవివాహమనియు శాస్త్రములయందుఁ జెప్పఁబడియున్నవి. ప్రతిలోమవివాహములు మిక్కిలి నింద్యములుగా నెంచఁబడి నిషేధింపఁబడినవి. ఇఁక ననులోమవివాహములను మనువు కూడ నొప్పుకొనియేయున్నాఁడు. విభిన్న జాతులలో వివాహములంగూర్చి యెట్టి ప్రమాణములను జూచితిరో భోజనాదికములం గూర్చియు నావిధముగనే ప్రమాణములను చూడఁగలరు. ఈప్రమాణములకై యెంతయో వెదకనక్కఱలేదు. పరాశర స్మృతి కలియుగమునకుం దగిన ధర్మశాస్త్రమని నిర్ణయింపఁబడినదో యందులోనే యీవిధముగ నున్నయది:

"క్షత్రియోరపి వైశ్యోర్వా క్రియావన్తౌ శుచివ్రతౌ ।
తాద్గృహేషుద్విజైర్భోజ్యంహవ్యకవ్యేషునిత్యశః ॥"

అర్థము—క్రియావంతులును శుచివ్రతులునునగు నే క్షత్రియులును, వైశ్యులును గలరో వారల గృహములందు బ్రాహ్మణులు హవ్యకవ్యములం దెల్లపుడు భోజనము చేయ నగును.

ఎట్లయినను, జాతిభేదముయొక్క కఠిన నియమముల న్నియు నేర్పరుపఁబడుట కనేక దినములు పట్టినవి. నితాంత వైరభావమును, ద్వేషభావమును జనింపకపోయినఁ బరస్పర భోజనాదులును, వివాహసంబంధములును లేకుండుట తటస్థింపదు. వర్తమానసమయమున నేమి జరుగుచున్నదో చూడుఁడు! ఏకారణముచేనయినను ఇరువురు గృహస్థులలో మనస్తాపము సంభవించిన నేకారణముచేనయినను శతృత్వము వాటిల్లినవారొండురులతో మాటలాడుటను జాలించి యొకరి యింటికి మఱియొకరు పోవుటను మాని భోజనాదికములను మానివేతురుగదా! ఒకరి నొకరు తమ గృహములకుం బిలిచి యభ్యర్థాన మొసంగుట యొండొరులలో సద్భావమున్నపుడే తటస్థించును. ఎచ్చట సఖ్యభావము లేదో, స్నేహమును బాంధవ్యమును గలుగనేరదో, యచ్చటఁ బరస్పరాతిథ్యమును గ్రహింపఁబడదు. ఈదినములలో సహితము రెండు గ్రామము

లవారిలోఁ గలహములు జరిగిన, వారు తమలోఁ దాము వివాహసంబంధములను మానుకొనుచున్నారు. పూర్వకాలమునందు సహా యీవిధముననే విభిన్నజాతులవారు ఆహారవిహారములను మానుటచే వారలలో నిచ్చిపుచ్చుకొనుటలు లేకపోయెను. వారలలో వివాదవిసంవాదములవల్లనే, వివాహాదికార్యములు లేకుండుట పొసఁగెనేని వారలలో విద్వేషభావముండెననుటకును, వారలలో నన్యోన్యకలహములు వాటిల్లెననుటకును మనకు దృష్టాంతము లేవియు లేవేయని మీరనవచ్చును. దానికి సమాధానముగా నొకటి రెండు నిదర్శనములను వివరించెదను. ప్రథమమున విశ్వామిత్రునికిని వసిష్టునకును గల పోరాటము మీకందఱికిని దెలిసినవిషయమే. విశ్వామిత్రుఁడు క్షత్రియుఁడయ్యును బ్రాహ్మణత్వమును బడయుటకై తపస్సు చేసెను. అందుచే నాతఁడు వసిష్టాది ఋషిపుంగవుల యీర్ష్యకుఁ బాత్రుఁడయ్యెను. ఇచ్చట మనమొక క్షత్రియుఁడు బ్రాహ్మణత్వమును బడయుటకై చేసిన ప్రయత్నమును జూచుచున్నారము. మఱియొక చోట బ్రాహ్మణుఁడగు పరశురాముఁడు ఇరువదియొక్క పర్యాయములు క్షత్రియులపై దాడివెడలి వారి రక్తముచేఁ బితృతర్పణము చేసెనని చెప్పఁబడియున్నది. వేణుఁడు, నహుషుఁడు, నిమి, మొదలుగాఁగల వారి యుపాఖ్యానములలోఁ గూడ బ్రాహ్మణ క్షత్రియుల మధ్యఁ గల ఘోరవివాదములను గూర్చియే వివరింపఁబడియున్నవి. ఈయుపా

ఖ్యానములవలెనే యింకను ననేకములు గలవు. ఇదిగాక పూర్వకాలమున బ్రాహ్మణులకును క్షత్రియులకును వివాదము లుండెడివని తెల్పుటకు నితర విధములగు ప్రమాణములును గలవు. బృహదారణ్యకోపనిషత్తునుండి జాత్యుత్పత్తినిం గూర్చి చెప్పఁబడిన వాక్యములలో నేవి యుద్ధృతము కాఁబడినవో వానికి వెంటనే పూర్వోక్తవచనముల లిఖించిన యాతఁడు బ్రాహ్మణ క్షత్రియజాతుల ప్రాధాన్యమును స్వీకరించుచు నుభయులకును సంధి కల్పించుటకై ప్రయత్నము చేయునటులఁ దెలియవచ్చుచున్నది. ఎట్లనఁగా:—

"తస్మాత్ క్షత్రాత్ పరంనాస్తి తస్మాత్ బ్రాహ్మణః క్షత్రియ మధస్తాదుపాస్తే రాజసూయే క్షత్ర ఏవతద్యశోదధాతి సైషాక్షత్రస్య యోనియద్ బ్రహ్మ తస్మాత్ యద్యపి రాజా పరమతాంగచ్ఛతి బ్రహ్మైవాన్తతః ఉపనిశ్రయతిస్వాం యోనిం యఏనం హినస్తిస్వాంస యోనిమృచ్ఛతి పాపీయాన్ భవతి."

అర్థము—ఆకారణమున క్షత్రియులకంటె శ్రేష్ఠులు లేరు. ఈ కారణము వలననే రాజసూయయాగమునందు బ్రాహ్మణులు క్షత్రియుల కధీనమై యుపాసన చేయవలయును. ఆయశమును క్షత్రియులే చెందుదురు. అయితే క్షత్రియులకు బ్రాహ్మణులే యుత్పత్తిస్థానము. కావున క్షత్రియు

లు పరమోన్నతినిం బొందవలయునన్న స్వీయోత్పత్తిస్థానమగు బ్రాహ్మణులనే యాశ్రయించవలయును. ఏక్షత్రియుఁడు బ్రాహ్మణునికిఁ గ్లేశముఁ గలిగించునో యాతఁడు తన యుత్పత్తిస్థానమునే నష్టపఱుచుకొనును. కావున నతఁడు పాపియగును.

దీనికి ఫలితార్థ మేమనఁగా:—

"మీ రిరుతెగలవారును వివాదపడకుఁడు. ఒకవిధమునఁ జూచిన క్షత్రియులు శ్రేష్ఠులు, మఱియొక విధమునఁ జూచిన బ్రాహ్మణులు శ్రేష్ఠులు; ఇరుతెగలవారికిని శ్రేష్ఠత్వము గలదు." ఈవిధముగా బహు శతాబ్దములనుండియు బ్రాహ్మణులకును, క్షత్రియులకును వివాదములు పెఱిగి పోరాటము లెచ్చుచుండెననియుఁ దుద కుభయపక్షములవారి యనుమత్యనుసారము క్షత్రియులు దేశరక్షణమును, రాజ్యపరిపాలనమును జేయునట్లును, బ్రాహ్మణులు యజన, యాజన, అధ్యయన, అధ్యాపనాదికార్యముల నియుక్తులగునటులను వీరు పరస్పర మొకరి యధికారమును మఱియొకరు సంపాదించుటకుఁ బ్రయాసపడకుండు నటులను స్థిరమయినటుల నూహింపనగును. ఈవివాదములు, కలహములు జరిగిన సమయముననే బ్రాహ్మణ క్షత్రియ ప్రభృతిజాతుల మధ్య క్రమముగా నాహారవిహారాదులు నిలిచిపోయి యుండవచ్చును.

ఈవిధముగాఁ బ్రాచీ నార్యసంఘమునందు సంధి

స్థాపితమై శాంతి నెలకొల్పఁబడెననుట వాస్తవమే కాని బ్రాహ్మణుల ప్రతాపమును, బరాక్రమమును దినదినాభివృద్ధి గాంచసాగెను. ఏయధ్యాత్మికశక్తిచే సంఘ మెల్లపుడును శాసింపఁబడుచుండునో, ఆశక్తి యాబ్రాహ్మణుల సొత్తాయెను. రాజేమో క్షత్రియుఁడేకాని మంత్రి బ్రాహ్మణుఁడే. న్యాయమూర్తి క్షత్రియుఁడే కాని బ్రాహ్మణుఁడే ప్రాడ్వివాకుఁడు కావలసివచ్చె. రక్షకుఁడు క్షత్రియుఁడే కాని యతని గురువు బ్రాహ్మణుఁ డయ్యెను. క్షత్రియుఁడు చేతులును, బ్రాహ్మణుఁడు మస్తిష్కమును. బాహువులకంటె మస్తిష్కము శ్రేష్ఠము గనుక బ్రాహ్మణుల ప్రభావము దినదినాభివృద్ధిం గాంచి నిరంకుశాధికారముగాఁ బరిణమించెను.

ఎప్పు డీవిధమున నార్యసంఘమునందు బ్రాహ్మణుల శక్తియును, బ్రతాపమును నిరంకుశత్వమును వహించెనో యప్పుడే పరాపరజాతులు హీనదశను బొందసాగిరి. రాజులు కేవలము నామమాత్రులయి రాజదండమును మాత్రము బూనుచుండిరి గాని, బ్రాహ్మణులే సర్వమును నడపెడివారు! వైశ్యులింకను మఱింత దీనదశలోనికి వచ్చిరి. ఇఁక శూద్రులను గూర్చి చెప్పనక్కఱయే లేదు. వారు సర్వవిధములగు సామాజికశక్తినుండియు, నధికారమునుండియు వంచితులై నితాంత నికృష్టులును బశుప్రాయులునై జీవనము గడపసాగిరి. వీరి సామాజిక దుర్గతికి నంతము లేకుండెను. వీరి దుస్థితినిఁ గూర్చి

యేవిధముగాఁ దెల్పుదు? మనుసంహిత రచియింపఁబడిన కాలమే జాతిభేదముయొక్క ప్రకోపపుఁ బరాకాష్ఠకాలమని యెంచవచ్చును. అయిన నీక్రింద యుద్ధృతము గాఁబడిన మనుసంహితలోని వాక్యములను జూచి పాఠకులు ప్రాచీనార్యసంఘమునందు నిర్భాగ్యులగు శూద్రుల దుస్థితి యెంతవరకు వచ్చినదో తెలిసికొనవచ్చును.

మనువు చెప్పిన దేమనఁగా :—

“ యేనకేన చిదంగేన హింస్యాచ్చేచ్ఛ్రేష్ఠమన్త్యజః
ఛేత్తవ్యం తత్తదేవాస్య తన్మనోరనుశాసనం॥”

అర్థము—అన్త్యజులు లేక శూద్రు లేయంగముచేనయిన శ్రేష్ఠజాతివానిని బ్రహరించినయెడల వారియొక్క యాయాయంగములు ఛేదింపఁబడవలయును. ఇదియే మనువుయొక్క విధి. మరల

“ పాణిముద్యమ్యదండం వా పాణిచ్ఛేదనమర్హతి ।
పాదేన ప్రహరన్ కోపాత్ పాదచ్ఛేదనమర్హతి॥”

మను 8 వ అధ్యాయము.

అర్థము—శూద్రుఁడు శ్రేష్ఠజాతి మానవునిఁ బ్రహరించుటకై చేతినిఁ గాని లేక దండమును గాని యెత్తినయెడల, శూద్రుని హస్తచ్ఛేదనము చేయవలసినది; కోపవశముచేఁ

పాదములచేఁ బ్రహరించినఁ బాదములను ఛేదింపవలయును.

ఇంకను—

"సహాసనమభిప్రేప్సురుత్ కృష్టస్యాపకృష్టజః ।
కట్యాం కృతాం కోనిర్వాస్యః॥"

అర్థము—శూద్రుఁడు శ్రేష్ఠజాతివారితో నేకాసనమునఁ గూర్చుండ నభిలషించెనేని వాని కట్టి ప్రదేశమును నెఱ్ఱగాఁ గాల్చిన యినుపకడ్డీలతో వాఁతలు వేసి దేశమునుండి తరుమఁగొట్టవలయును.

ఎట్టి ఘోరము! ఉచ్ఛజాతివారితో నేకాసనముగఁ గూర్చుండు మాట యటుండనిండు. కేవలము కూర్చుండ నభిలషించినను నాతని నిర్వాసితునిఁగఁ జేయవలయునఁట!

ఉత్కృష్టజాతులవారితో సమానముగఁ గూర్చుండవలయునన్న శూద్రులపై నెట్టి కఠినశాసన ముండెనో చూచితిరి. ఇంక నితర సామాజిక స్వాతంత్ర్యముల విషయమై శూద్రుల గతి యెట్లుండెనో చూడుఁడు. ఏ సామాజిక స్వాతంత్ర్యములను మానవుఁడు ప్రియమని తలఁచునో, మఱియు నే సకలస్వాతంత్ర్యముల యభావమున మానవుఁడు జీవనమును భారముగను, విడంబనముగను నెంచునో, వానిలో దన స్వాశాక్యవిషయములఁ గూర్చిన స్వాతంత్ర్యమే పర్వశ్రేష్ఠమయిన

యధికారమని తలఁచును. అనఁగా నేకార్యము చేసిన నాకు మేలొనఁగూడునో, దేనియందు నాకనురాగము కలదో, దేనిని జేసిన నేను గృతకార్యుఁడ నగుదునని యాశింతునో దానినే నేను జేయుదును; నేను గష్టపడి సంపాదించిన యన్నము నింటికిఁ దెత్తును. కష్టముతోఁ దెచ్చిన యన్నమును సుఖముగా భార్యాపుత్రాదులతోఁ గలసి భుజింతును." హా! అతిదరిద్రుఁడు సహా యీకోరికను గలిగియుండును గద! మన యందరిది మానవదేహమే, మానవజీవితమే! మనుష్యుని ప్రాణము నిరుపగ్రవముగను, తన యిష్టానుసారముగను, రుచి ననుసరించి స్వంతముగా శ్రమపడుటచే సంసారమున సుఖపడుటను గోరునా కోరదా యని మనము నిష్కపటముగా హృదయములను జూచి యాలోచింతము. కాని యొకపర్యాయము ప్రాచీనార్యసంఘ మెట్లుండెనో చూడుఁడు.

మనువు చెప్పినదేమనఁగా:—

"శూద్రన్తు కారయేద్దాస్యం, క్రీతమక్రీతమేవవా ।
దాస్యాయైవహిసృష్టోసౌ బ్రాహ్మణస్యస్వయంభువా॥"

అర్ధము—శూద్రుఁడు క్రీతుఁడయినను, నక్రీతుఁడయినను, బ్రాహ్మణుఁడు వానిని దాసత్వమున నియోగింపవచ్చును. కారణ మేమనఁగా బ్రాహ్మణుల దాసత్వమునకే యీశ్వరుఁడు వారిని సృష్టించెను.

మరల

“నస్వామినాని సృష్టోపి శూద్రోదాస్యాద్విముచ్యతే।
నిసర్గజంహి తత్తస్యకస్తస్మాత్తదపోహతి॥”

మను 8 వ అధ్యాయం.

అర్థము—యజమానుఁ డొకవేళ శూద్రుని దాసత్వమునుండి విడిపింపఁదలచినను శూద్రుఁడు ముక్తిని బొందనేరఁడు. కారణ మేమనఁగా దాసత్వమే యతనికి స్వభావజాతమయినది గనుక దాని నెవ రుల్లంఘనము చేయఁగలరు?

నే నొకపనిని జేయవలయునని యాసక్తి గలిగి యున్నపుడు మఱియొకఁడు నన్ను బలవంతముగ మఱియొక విధమగు కార్యమును జేయునట్లు చేసెనేని, మానవాత్మ యట్టియవస్థలో నెట్టిబాధ ననుభవించునో మీలో మీరే యొక్కసారి యాలోచించి చూడుఁడు! తనకు నిష్టమయిన కార్యమును జేయుటకును, అభిరుచిగల పనికై పాటుఁబడుటకును, శ్రమఁజెందినపుడు విశ్రాంతి నొందుటకును మానవునికి స్వాతంత్ర్యము లేనియెడల, నాతనికి జీవిత మెంత భారావహమగునో యోచింపుఁడు. కాని ప్రాచీనకాలమున నార్యసంఘమునందలి బ్రాహ్మణులు శూద్రుల నిట్టి ఘోరదాసత్వమునందుంచియు సంతుష్టినొందలేదు. ధనము నార్జించుట యనునది మానవులకున్న స్వాతంత్ర్యములలో నొక్కటి, ఆస్వాతంత్ర్యమునుండి

కూడ శూద్రులు వంచితులయిరి. మను వేమిచెప్పుచున్నాఁడో చూడుఁడు.—

“విశ్రద్ధం బ్రాహ్మణః శూద్రాద్ద్రవ్యోపాదాన మాచరేత్ । నహితస్యాస్తి కించిత్ స్వం భర్తృహార్య-ధనో హిసః॥”

మను 8 వ అధ్యాయం.

అర్థము—శూద్రుఁడు ధనమును సంపాదించినట్లయిన బ్రాహ్మణుఁడు సంకోచ మేమియు లేకయే యంతయును లాఁగికొనవచ్చును. కారణమేమనఁగా శూద్రునికి ధన ముంచుకొనుట కధికారము లేదు(!) అతఁ డేదయినఁ గొంచెము సంపాదించునెడల నదియంతయు నాతని యజమానునిదే.

మఱియు—“శక్తేనాపిహి శూద్రేణ నకార్యోధనసంచయః। శూద్రోహి ధనమాసాద్య బ్రాహ్మణానేవబాధతే॥”

అర్థము—శూద్రుఁడు సామర్థ్యుఁ డయినప్పటికిని ధనమును గూర్పఁగూడదు. కారణ మేమనఁగా శూద్రుని చేతిలో ధనము కూడిన బ్రాహ్మణాదులు దుఃఖమును బొందవలసివచ్చును.

ఇంకను మీ రేమి వినఁగోరుచున్నారు? శూద్రుఁడు ధనశాలియగునెడల బ్రాహ్మణుల పరితాప మడఁగును గనుక

వారి నిరంకుశప్రభుత్వమునకు హాని రాకుండుటకై శూద్రులు శక్తిశాలురయినను ధనము నార్జింపఁగూడదు ! శూద్రుఁడు తన యిచ్చవచ్చినటులఁ బాటుబడఁగూడదు. ఇష్టము కలిగినపుడు విశ్రాంతి నొందఁగూడదు. స్వతంత్రముగా విహరింపఁగూడదు. శరీరమునందలి రక్తము జలమగునటులఁ గష్టపడి సంపాదించుకొన్న వస్తువులపైన సహా యతనికి స్వాతంత్ర్యము లేదు. మీఁదుమిక్కిలి బ్రాహ్మణుల ప్రభుత్వమునకు హాని కలుగునేమోయని శూద్రులు ధనమును సంచయము చేయ రాదు ! ఎట్టి ఘోరశాసనమో చూడుఁడు ! ఇంకనున్నది ; నిధానింపుఁడు. ప్రాచీన శాస్త్రము లింతటితోఁ దృప్తినొందినను గొంతవఱకు మేలే యనుకొనవచ్చును. మానవమాత్రునికి ధర్మము (మతము) నందధికారము కలదు. అట్టి ధర్మము నాచరించుటకైనను శూద్రులకు స్వాతంత్ర్య ముండినయెడల, ప్రాచీనకాలపు శాస్త్రకర్తలు మానవుని కేవలము పశుప్రాయునిఁగా వ్యవహరింపమని చెప్పియుండలేదనుకొనవచ్చును ; కాని చెప్పుటకు సహితము నామనస్సు కష్టముచేఁ గలవరపడుచున్నయది. నాహృదయమునుండి దుఃఖము పొరలి వచ్చుచున్నయది. అవమానముచేత నాతల వంగిపోవుచున్నయది. శూద్రులను సాంఘికస్వాతంత్ర్యముల నన్నింటినుండియు వంచితులను జేసియు వారికిఁ దృప్తి కలుగకపోయినది. కావున వారి (శూద్రుల) పశుత్వమును పరిసమాప్తినొందించుటకై వారిని

సంపూర్ణముగా మనుష్యత్వమునుండి కూడ వంచితులనుగఁ జేయుటకై వారిని ధర్మము నాచరించుటకుఁగల స్వాతంత్ర్యము నుండియు వంచితులనుగఁ జేసిరి. మను వేమిచెప్పచున్నాఁడో వినుఁడు :—

"నశూద్రే పాతకం కించిత్ నచసంస్కారమర్హతి ।
చాస్యధికారో ధర్మేఽస్తి న ధర్మాత్ ప్రతిషేధనం॥

మను 10 అధ్యాయము.

అర్థము—పయూఖాద్యములను భుజించుటవలన బ్రాహ్మణునికిఁ బాతకమో, యట్లు చేయుటవలన శూద్రునకుఁ బాతకము లేదు. శూద్రుని కేవిధమయిన ధర్మసంస్కారమును లేదు ; ఆతనికి ధర్మము నాచరించుటకే యధికారము లేదు. కావున ధర్మమునుండి నిషేధమును లేదు.

ఎంతయన్యాయమో చూడుఁడు ! మనము దేనిని దుష్కర్మములని చెప్పదుమో, వానినే పశువులు చేసినయెడలఁ బాపమని తలంపము. కారణ మేమనఁగాఁ బశువులు ధర్మనియమములకు నధీనమయి యుండలేదు. అదేవిధముగ నే కార్యము నొనరించిన బ్రాహ్మణులకుఁ బాతక మగునో వానినే శూద్రుఁ డొనరించినఁ బాతకము కాదు. కారణ మేమనఁగా శూద్రునికి ధర్మానుష్ఠానమున నధికారము లేదు.

హా పరమేశ్వరా! మనుష్యులయ్యును మనుష్యులనే యీవిధముగఁ బీడింపఁగలరా? భ్రాంతిపరుఁడగు నోయువజనుఁడా! నీవు శాస్త్రములు, శాస్త్రములని మొఱ్ఱపెట్టుచుందువే, శాస్త్రము లెట్లున్నవో చూడుము! ఇట్టివేనా శాస్త్రములు? ఇదేనా ధర్మము? ఇదియే ధర్మమగునెడల నిఁక నధర్మమేది? మానవులను బశువులనుగాఁ జేయుట కాదేశ మొసంగునది యేమిశాస్త్రము? నరకకుండమెచటనయిన నున్నచో నీభాగము నందులో వేయుము. శాస్త్రములయొక్క యీభాగమును కాల్చి భస్మముచేసి కర్మనాశానదీప్రవాహమునఁ బడవేయుము. బ్రాహ్మణులయొక్క ప్రతాప మణఁగిపోయినందునకును శూద్రులు తలయెత్తి తిరుగు నవకాశముకలిగినందునకును నేను భగవంతునికి గణనాతీతములగు ధన్యవాదములను హృదయపూర్వకముగఁ జేయుచున్నాఁడను. హిందూశాస్త్రకారుల ప్రతాపమే ప్రబలమయినయెడల నిఁక బ్రదుకుమార్గముండెడిదా?

అప్పుడు, ప్రస్తుతము బంగాళీసమాజమునకు నాయకులుగనున్నవా రెచట నుండియుందురు? నేఁడపరాహ్ణముననే కృష్ణదాస్‌పాల్ మహాశయుని మృతదేహమునుచితానలమున కర్పించి వచ్చితిమో, యాతఁ డెచటనుండెడివాఁడు? నేఁడు కృష్ణదాస్‌పాలుని మృతదివసము. నేఁడు బంగాళీయువజనులు సరళభావముతో సత్యప్రియులరీతి, జాతిభేదముయొక్క తీవ్ర

ము శిథిలమగుటచే మీదేశమునకుఁ గళ్యాణమైనదో లేక యశుభము వాటిల్లినదో చెప్పఁడు చూతము. మీరు వీనినెల్లను రద్దుపరచి మరలఁ బ్రాచీనవిధివ్యవస్థలను బ్రబలింపఁగోరెదరా? మీ కట్లుచేయుటకు శక్తిగలదా? మీరు కాలముయొక్క ప్రబలగతి నడ్డుపెట్టఁగలరా! మీరీ పరివర్తనస్రోతమును త్రిప్పివేయఁగలరా? మీ రీపని చేయఁగల్గినయెడల మీ కనిష్ఠయంగుళిపై గోవర్ధనము నెత్తఁగలరు! కాని మీతరము కాదు, కాదు, ముమ్మాటికినిఁగాదు. మీ కొక్కరికే కాదు, మీవంటివారు మఱి లక్షమంది పూనికొనినను, సభ్యసమాజముయొక్క వికాశోన్ముఖశక్తుల నడ్డపెట్టఁజాలరు. చిరకాలమునుండియుఁ బరాధీనులయి, చిర బంధీకృతులయిన జాతుల నన్నిఁటికిని ముక్తినొసంగుటకై యీశ్వరుని విధులు ప్రచారమగుచుండుటను జూడలేరా? ఈవిధులకుఁ బ్రతికూలముగ నడుచుట కెవరితరము? చూడుఁడు జాతిభేదముయొక్క యవసానకాలము తటస్థించినది. ఇఁక దాని నెదుర్కొనుటయును మృతకళేబరముపై ఖడ్గఘాతమును వేయుటయును రెండును సమానమే. జాతిభేదముయొక్క మృత్యుదివసములు దగ్గరించుచున్నవని విశ్వసింపుఁడు; ఇఁక దీనిని మృత్యువునుండి రక్షించుటకు నౌషధములు లేవు. ఇఁక మీరు దీనిని బ్రతికించవలయునని దలఁచిన ప్రాచీనకాలపు సకలవ్యవస్థలను బునర్జీవింపఁదలచుకొంటిరా యేమి చెప్పఁడు? మీకిది యిష్టముకాదని నిశ్చ

యముగాఁ జెప్పఁగలను. అందునకుఁ గారణము నీచజాతులవారు ఉచ్ఛజాతీయులకు ధర్మోపదేశములను జేయుటను శాస్త్రములం దేకాలముననైన నెప్పుడయినను జూచితిరా? నిమ్నజాతి మానవుఁడు బ్రాహ్మణాదులకు ధర్మోపదేశములను జేయుటకుఁ బ్రయత్నించునెడల నెఱ్ఱఁగా గాఁచిన నేతినతనిగొంతుకలోఁ బోయుమని మనువు చెప్పియున్నాఁడు. కాని యీకాలమున నెందరు నికృష్టజాతులవారు బ్రాహ్మణులకు ధర్మోపదేష్టలయిరో చూడుఁడు. ఎంతమంది బ్రాహ్మణులు వీరలవద్ద ధర్మోపదేశములను బడసి తాము కృతార్థులమయితిమని తలఁచుచుండలేదు? ఈకారణముననే యిఁక జాతిభేదము లేదని చెప్పుచున్నాను. మీకిది తోఁచలేదా?

జాతిభేదాచారమునకు వర్తమానపు దౌర్బల్య మేవిధముగాఁ దటస్థించినదో దానివిషయమై కూడ కొంచెము చెప్పవలసియున్నది. మనుస్మృతినుండి యుద్ధృతీకరింపఁబడిన శ్లోకములనుండి, యింతకంటె నెక్కువ సామాజిక యత్యాచారములు జరుగనేరవని మీకందఱికిని దోఁచియుండవచ్చును. సామాజికయత్యాచారము లెపుడసహ్యము లగుచుండునో, ఎప్పుడా దుర్వ్యవహారముక్రింద స్త్రీలయొక్కయు బురుషులయొక్కయు ప్రాణములు నలిగిపోవునో యప్పుడే యాసామాజికవ్యాధినుండియే దానికౌషధమును (అనగా దన్నిర్మూలనమార్గమును) గనఁబడుచుండునని యితిహాసమునందు మాన

వసంఘముయొక్క పోకడవృద్ధిక్షీణములను కనిపెట్టినవారెఱుంగుదురు. దానికి పర్యవసానముగ నిదివరకు త్రొక్కఁబడిన వారికి పగదీర్చుకొనవలయుననెడి ప్రకృతి ప్రబలమగుచు ఘోరతరమగు సాంఘికవిప్లవములు జరుగుచుండును. ఇట్టిసమయములలో నప్రతిమమగు ప్రతిభాసంపన్నులగు మహాపురుషు లుద్భవించి, రహస్యముగా కన్నీళ్లు గార్చుచుండెడి శతశతజనములను వీరు చూతురు. చూచి వారల హృదయములలో రగులుచుండిన క్రోధాగ్ని యామహాపురుషుల హృదయమున ప్రచండదావానలరూపమును దాల్చి, శతసహస్రహృదయములలో జాగరితమయినకోర్కెలే యామహాపురుషుల జీవితములందు ఘనీభవించుచుండును. వారప్పుడు నిగృహీతులును, బదదళితులును, ప్రపీడితులు నగు జాతుల నన్నిటికిని బ్రాతినిధ్యమును వహించి, వారి స్థానమున జగత్తునంతయుఁ దమ సింహనాదములచే నాడించివేతురు, మఱియుఁ బ్రపంచమునఁ దమ కాటంకముగఁ బనిచేయుచుండు సకల శక్తులవంకను దృష్టినయినను నిలుపకయే సత్యముయొక్కయు, న్యాయముయొక్కయు విజయపతాకమును సంస్థాపింతురు. ఇంకను దమ వజ్రముష్టితో నత్యాచార మొనరించెడివారల సింహాసనములను కోళ్ళతోఁ బట్టి యూఁగించి నేలఁ గొట్టి తుత్తునియలుగాఁ జేయఁ బ్రయాసపడుదురు. వారే పురుషసింహులు. రోముదేశముయొక్క పోపు లనెడి మతాధిపతులచే నొనరింపఁబడుచుం

డెడి యత్యాచారములనుండి ప్రజలను రక్షించుటకై ఐరోప దేశమునందొక వీరపురుషుఁడు జన్మించెను. ఆతఁడే మార్టిన్ లూథరు. ఫరాసిదేశమునందలి విద్రోహము (Revolution) నకేమి కారణమో చూడుఁడు. ధనవంతులయొక్క యత్యాచార మెప్పు డసహనీయమయ్యెనో, యప్పు డొక్కవైపునఁ బ్రజలలో దరిద్రులుగా నుండువారు పిడికెడన్నమునకై నానాయవస్థలు పడుచుండ మఱియొకవైపున ధనికులు తమ ప్రాసాదములయందు విలాసినులతోఁ గూడి నానావిధ సంతోషములయందుఁ బ్రమత్తులగుచుండిరి; ఒకవైపు ప్రజలు క్షుదాతురులై కుక్కలవలె నిల్లిల్లు తిరుగుచు పురుగులవలె మార్గమధ్యమున రాలిపోవుచుండ, మఱియొకవైపు ధనికులట్టి దౌర్భాగ్యుల దుస్థితినయినను గనుఁగొనకపోవుటయేగాక వారిపై యసహ్యమును జూపుచుఁ దమద్వారములవద్దనుండి తఱిమివేయుచుండిరి. ఇట్టి ఘోరవైషమ్యము, ఇట్టి ఘోరమయిన దుర్దశ, ఇట్టి ఘోరమయిన సామాజికాత్యాచార మెప్పుడు దుర్వహమయిన భారముగఁ బరిణమించెనో, యప్పుడీభూమ్యాకాశములు కంపించునట్లుగ నీశ్వరుని వాణి "అభ్యుత్థానము కండు, విద్రోహపతాకము నెగురనిండు" అని ప్రతిధ్వనితమయ్యెను. ఇట్టి రక్తపాతముతోఁ గూడిన విద్రోహము నీశ్వరాజ్ఞయని చెప్పచున్నందున కాశ్చర్యపడెదరా! నిశ్చయము, అత్యాచారమొనరించువారికి వారి దుండగముల మధ్యనుండియే దండన

మును నిహితమగునటు లొనరించియుండుటను, నేను దివ్యచక్షువులతోఁ జూచుచున్నాఁడను. విద్రోహకు లనవసరముగా నిష్ఠురమును జూపినందునకును, మోసమును జేసినందునకును, బశుతుల్యులుగఁ బ్రవర్తించినందునకును, రక్తప్రవాహములొనరించినందునకును దుఃఖింపవలసియున్నది. మఱియు మానవప్రకృతియొక్క దుర్బలత్వమునకై లజ్జ వహింపవలసి యున్నది. కాని యీసముదాయరక్తపాతమునకును, నృశంసతకును, పాపాచరణమునకును వెనుక మనము చూతుమేని యీశ్వరుఁ డత్యాచారులను దగిన రీతిని దండించి యుండుటను మనము కాంతుము. అదేవిధముగఁ బ్రాచీనార్యసంఘమందు బ్రాహ్మణులయొక్క ప్రబలమయిన ప్రతాపముచే హీనజాతులవారందరు నెవుడు కంపితులయిరో, దేశ పరిపాలకులయొక్క శక్తిసహిత మెప్పుడు నామావశిష్టమయినదో, అధ్యాత్మిక దాసత్వమునందుఁ బ్రజ లెప్పుడు మానవత్వమును సయితము కోల్పోవుటచే మానవులు పశుప్రాయులయిరో, అప్పుడే యీశ్వరుఁడు "ఉత్థానముకండు" అని ఆజ్ఞాపించెను. అనినంతనే యువరాజగు సిద్ధార్థుఁడు సత్యమనెడి దీవటీని హస్తమున ధరించి భారతాంధకారమున లేచి నిలువబడెను. ఈ వచ్చిన దెవరని భారతక్షేత్రమునఁ గలరవముపుట్టెను. బుద్ధుఁడేవిధముగ నొకవైపున రాజ్యసంపదను కాలితోఁ దన్నెనో, మఱియొకవైపున బ్రాహ్మణులయొక్క యాధ్యాత్మిక ప్రభు

త్వముపై సయితము ఖడ్గఘాతము వేసి "ఓ పదదళితనిపీడిత జాతులారా రండు నాసమీపమునకు" అనెను. "నేను మిమ్ముల్లను ఆలింగనము చేసికొనుచున్నాను. నామత మాకాశమువలె విశాలమయినది. దాని తలమున బ్రాహ్మణులు, చండాలురు, పురుషులుస్త్రీలు, ధనికులు దరిద్రులు, బాలకులు వృద్ధులు, అందరును సమానభావముతో నివసింప వచ్చును." అని బోధించెను. సత్యముయొక్క విజయభేరిని మ్రోగించుచు, నెపు డీమహాఘోషణము ప్రచారితమయ్యెనో యపుడు భారతసమాజ ముత్తప్తపాకపాత్రమురీతిఁ గుతకుతమని యుడుకనారంభించెను. భారతభూమి యొక పురుషరత్నమును బ్రసవించి యింక నిద్రపోవుట కిష్టపడలేదు. బుద్ధుని యొక్క యభ్యుదయముతోఁ బాటు భారతసమాజమున రెండు ప్రధానములగు విషయములందుఁ బరివర్తన మగుపడెను. ప్రథమమున నాకాలమునుండియు హిందూసమాజము విభిన్నసాంప్రదాయములుగ విభజింపఁబడుచు వచ్చెను. ఏవిధముగ మహనీయుఁడగు లూథరు ఐరోపాఖండమునం దొక్కసారి స్వాతంత్ర్యపతాకము నెగిరించుటచే నాస్వాతంత్ర్యప్రవృత్తి నలుదిక్కులయందును బ్రబలమయి జనులు తమయొక్క ధర్మజ్ఞానమునే యనుసరించుచుఁ బనులను జేసికొనుటకు నేర్చుకొనిరో, యదేతీరున భారతవర్షమునందును నట్టి స్థితియే సంఘటిల్లెను. బుద్ధదేవుఁడు బ్రాహ్మణుల ప్రతాపమును ప్రతిఘటించుచుఁ

బ్రతివాదముయొక్క మార్గమును దెరచివైచెను. అది మొదలుకొని నలుగడలనుండియు స్వాతంత్ర్యాభిప్రాయమనెడి ధ్వజము విజృంభించుటకు నారంభించెను. ఇఁక రెండవది యేమనఁగా బౌద్ధధర్మము ప్రచారమగుటకు నారంభమయినది మొదలు నీచజాతులవారి యున్నతియును నారంభమయ్యెను. కాలక్రమమున 'శ్రమణ' శబ్దము 'బ్రాహ్మణ' శబ్దమునకుఁ బ్రతిద్వందిరూపముగ నిలిచెను. ఏభారతవర్షమున నొకానొక కాలమందు మనువు శూద్రరాజ్యమునందు వాసముచేయుటను నిషేధించెనో, ఆభారతవర్షమునందే బుద్ధుఁడు జన్మించిన మూఁడువందల సంవత్సరముల లోపుగనే శూద్రునియొక్క నామముతో రాజ్యము ప్రతిష్ఠితమయ్యెను!

ఈవిధముగ మహాత్ముఁడగు శాక్యసింహుఁడు భారతసమాజమునం దొక యభూతపూర్వమగు పరివర్తనమును దెచ్చిపెట్టెను. బ్రాహ్మణులయొక్క శక్తికిఁ బ్రబలమయిన యాఘాతము కలుగుటయును, జాతిభేదముయొక్క కఠోరనియమములు సయితము కొంచెము శిథిలమగుటయును వాస్తవమే, కాని బ్రాహ్మణులయొక్క ప్రభుత్వము మాత్రము పూర్తిగా విలుప్తము కాలేదు. దేశమునందు హిందూరాజుల ప్రభుత్వమింక నుండియున్నది. పాటలీపుత్రమునందలి ప్రభువులు మాత్రము బౌద్ధధర్మమును ప్రచారము చేయుచుండిరి. కాని తక్కిన ప్రదేశములందలి రాజులు హిందూధర్మమునే వ్యాపింపఁ

జేయుటయందు నిరతులై యుండిరి. బ్రాహ్మణులయొక్క ప్రతాపము రాజులయొక్క భుజబలముద్వారా సురక్షితమై యెప్పుడును గర్తృత్వ మొనరింపసాగెను.

జాతిభేదముపైని రెండవ యాఘాతము ముసల్మానుప్రభువులచేఁ గావింపఁబడెను. వీరు జాతిభేదమునకును విగ్రహారాధనమునకును ఘోరవిద్వేషులు. వీరు చెప్పిన దేమనఁగా "మీజాతిభేదములను గుఱించి మాకుఁ దెలియదు. మాపనుల నెవరు బాగుగ నొనరింతురో వారినే మేము సన్మానింతుము" అనియే. బ్రాహ్మణులు జాత్యహంకారముచే స్ఫీతులయి యీమ్లేచ్ఛులవద్దనుండి దూరముగా నిలువఁబడిరి. అత్తఱి శూద్రులును దదితర నికృష్టజాతులవారును ముందునకు వచ్చి వీరి యధీనమున రాజకార్యముల నన్నిఁటిని గ్రహించి వీరి భాషను సయితము నేర్వసాగిరి. ఇందువలన రెండువిధములగు మార్పులు తటస్థించినవి. మొదటిది—ఈక్రిందిజాతులకు సంబంధించిన హిందువులు మహమ్మదీయుల సంసర్గముచే వారినీతిరీతులను నేర్చుటకుఁ బ్రారంభించిరి. తరుచుగా జాతిభేదమునకును, విగ్రహారాధనమునకును విరుద్ధముగా నెల్లపుడును రాజాస్థానములందు వినుచుండుటచే వీరలకు హిందూధర్మమునందు నాసక్తి తగ్గుట ప్రారంభించెను. ఇఁక రెండవది యేమనఁగా—కాయస్థులు, వైద్యులు, మున్నగు హీనజాతులకుఁ జెందినవారి చేతులలో ధనము సంచయమగుటకుఁ బ్రారంభమ

య్యెను. వీరలలో ననేకులు ముసల్మాను ప్రభువుల వద్దనుండి సన్నదులను బడసి జమీందారులపదవినిఁ బడయసాగిరి. ఈవిధముగ నొకవైపున శూద్రులు పదవియందును, సామర్థ్యమునందును వృద్ధివడయుచు వారు సంఘమునందు నాయకులు కాసాగుటయును, మఱియొకవైపు పారసీభాష బహుళప్రచారమగుటచే, సంస్కృతవిద్యయొక్క యనాదరణమును దత్కారణముగ బ్రాహ్మణులు మూర్ఖులును, శాస్త్రజ్ఞానవిహీనులును నగుచు వచ్చిరి. కావున బ్రాహ్మణులయొక్క విద్యాబుద్ధులు క్రమముగా హ్రస్వమై వారు ధనికులగు శూద్రులను నాశ్రయించుచుఁ బరభాగ్యోపజీవులగునటులఁ దటస్థమైనది.

దేశ మిట్టిస్థితిలో నున్నపు డీయింగ్లీషువారు మనదేశమున నడుగుపెట్టిరి. ఈనూతనప్రభువులు ముసల్మానురాజులవలెఁ బ్రజలయొక్క మతముతో జోక్యమును గలుగఁ జేసికొనలేదుకాని సమాజముయొక్క పునాదులతో సహా పరివర్తనముచేయుటకుఁ దోడ్పడునంతటి మార్పులను దెచ్చిపెట్టిరి. మొట్టమొదట వీరు సకలశ్రేణులవారికొఱకును సరస్వతీసదనమును దెఱచివైచి, యందరికిని విద్య లభించుమార్గములను జూపిరి. చిరకాలమునుండి త్రొక్కఁబడుచు వచ్చిన జాతులవారందరును నెపుడు వీరలయొక్క గ్రంథములలో మనుష్యులయొక్క మానవత్వమును, మహాత్వమును గూర్చిన యంశములను జదువుటకు నారంభించిరో, యెప్పుడు స్వాతంత్ర్యమును గూర్చిన సం

గ్రామముల వివరణములను పఠించుటకుఁ బ్రారంభించిరో, యప్పుడు వారి హృదయములయందు నొకవిధమయిన నవజీవనముయొక్క స్ఫూర్తి కాసాగెను. అప్పుడు వారు తమ యెదుట నొక నూతనరాజ్యము, ఒక నూతనమగు యున్నతిమార్గము ప్రసరింపఁబడి యుండుటను గాంచి దానిని వారు మిగుల నాతురతతో వెంబడించుటకుఁ బూనిరి. క్రమముగా వడ్రంగులు, గొల్లలు, శడగోపులు, సువర్ణవణికులు, మొదలుగాఁ గలవారందరును నాంగ్లేయవిద్యాలయములకుఁ దమతమ బాలురను బంపుటకుఁ బ్రారంభించిరి. అందరిబిడ్డలు నొక్కచోట విద్య నేర్వఁగల్గిరి. ఒక్కయాసనమునఁ గూర్చుండసాగిరి. ఒక్కటిగా గలసి యాటలాడుటకుఁ బ్రారంభించిరి. ఒకవిధమైన పదవినే సంపాదింపఁగలిగిరి. ఇంతకంటె నధికమగు 'సమతాబోధము' ఎచట లభింపఁగలదు?

ఇఁక రెండవది యేమనఁగాఁ బాశ్చాత్యసాహిత్యమును గూర్చియు విజ్ఞానమును గూర్చియుఁ జర్చ లెంతవిరివిగా జరుగ ప్రారంభించినవో యంత విరివిగా లోకులయొక్క హృదయములు వికసింపనారంభించినవి. ప్రాచీనకు సంస్కారముల నన్నిఁటినిఁ దరిమివేయు నుద్దేశముతో ముసల్మానురాజులు తమ కత్తులను దూసిరి. కాని వారు ఖడ్గఘాతములతో నయితము చేయనేరని వానిని వర్తమానపుప్రభువులు విద్యాలయములను దెరచుటచే నంతకంటె నెక్కువ కార్యసాఫల్యతను బడసిరి.

తర్కములు లేకయే, ప్రచారముతో నవసరము లేకయే, సంగ్రామేమియు లేకయే నూతనవిద్య నభ్యసించిన మానవులకు సంస్కారములు విదూరితము లగుచున్నవి. ఈశ్వరుఁ డొకనిని బ్రాహ్మణునిఁగను, మఱియొకనిని శూద్రునిఁగను సృష్టించె ననెడిమాట పాఠశాలలోఁ జదివెడి పండ్రెండువత్సరముల బాలునివద్ద సహిత మపహాసపాత్రమగుచున్నయది!

మూఁడవది వర్తమానకాలమునందలి ముద్రాయంత్రముల వ్యాపనముచే సముదయప్రాచీనశాస్త్రములన్నియు ముద్రింపఁబడి యీ పామరసాధారణులచేతను బడుటచే శాస్త్రరూపములుగ నిదివఱకు దాఁచియుంపఁబడిన యస్త్రము లన్నియును బ్రాహ్మణులకు హీనజాతులవారిపైఁ బ్రభుత్వము సల్పుటయందుఁ దోడ్పడిన వేవో యవి యన్నియు నీకాలమునందు హీనజాతులవారి హస్తములలోఁ బడుచున్నవి. ప్రాచీనకాలమునందు శూద్రులకు వేదాధ్యయనము చేయుటకే యధికారము లేదని శాస్త్రకర్తలు చెప్పియుండ నిప్పు డేమి సంభవించినది? శూద్రునిమాట యటుండనిచ్చి మ్లేచ్ఛులు నయితము వేదముల నర్థించువారయిరి. మఱియును మనము వారివద్దనుండి వేదవేదాంగముల యర్థమును నేర్చుకొనవలసి వచ్చినది!

ఈ సకలకారణములచేతను బ్రస్తుతకాలమున జాతిభేదమనెడిది క్రమక్రమముగా సన్నగిలుచున్నది. వర్తమానపు

టాంగ్లేయసభ్యతతో సమానమగు శతృవు దీనికి మఱియొకటి
కానరాదు. ఆలోచించినచో జాతిభేదమును బాటించెడి యీ
యాచారముపై మన మింక దండెత్తవలసిన యగత్యమేలేదు.
ఇంగ్లీషువిద్య యనెడి చీడపురుగు దీనిని నంటినది. ఇది క్రమ
ముగా దానిచేఁ ద్వరలోఁ దొలిచివేయఁబడఁగలదు. మీ కేమి
తోఁచుచున్నది? వృథా తర్కములవలన నేమయినను లాభ
ముకలదని తలఁచితిరా? ఈకలకత్తాషహరునందు క్షణము
న కెంతమంది హిందువులు ప్రతిదినమును నాంగ్లేయ హోటళ్ల
లోఁ దినఁగూడని పదార్థములను దినుచుండియు, వారు నిరా
టంకముగ హిందూసంఘమున నుండియుండలేదా? కేవల
మంతియేకాదు. వారనేకస్థలములయందు సమాజపతులని,
దళపతులనియుఁ గూడఁ బ్రతిష్ఠాలాభము వడయుటలేదా? ఇఁ
క జాతిభేద మెక్కడనో యోచింపుఁడు?

ఇఁక నీదేశమున జాతిభేదము ప్రచలిత మగుటచే వా
టిల్లిన యనిష్టము లేవో యించుక యాలోచింతము. కాని
యనిష్టములను గణించుటకుఁ బూర్వము, లాభము లేవయిన
దానిచేఁ జేకూరిన, వానిని ముందుగ గమనించుట యావశ్య
కము. ఒక యాంగ్లేయగ్రంథకర్త జాతిభేదమును సమర్థించు
చు నొక పుస్తకమును వ్రాసియున్నాఁడు. ఆతఁడు జాతిభేద
మునకు సమక్షముగ నేమి చెప్పియున్నాఁడో చూతమని నే
నాపుస్తకమును మిగుల శ్రద్ధతోఁ జదివితిని. ఆతఁడు సూచిం

చిన లాభములలో రెండు ప్రధానమయినవి. నేను ప్రథమము
న నా రెంటినిఁ జేర్కొనెదను. ఆతఁడు చెప్పిన మొదటిలాభ
మేమనఁగా జాతిభేదముయొక్క నిబంధనలవలన హిందువుల
లో నీతి (అపేక్షాకృతము) విలసిల్లినది. ఇతరదేశములవైపు
మనదృష్టినిఁ బ్రసరించినయెడల నచ్చటి నీచజాతులవారిలో
నధ్యాత్మికనైతికావస్థ యెంత శోచనీయమో తెలియఁగలదు.
వారియొక్క పానాసక్తియును వ్యభిచారమును నెంతప్రబలము!
ఈ యుభయపాపములవలనను నాజాతులవారెల్లఁ బశుప్రా
యులుగ నున్నారు. జాతిభేదముయొక్క కఠినశాసనముల
నిర్బంధముచేఁ బైనఁగనిన రెండుపాపములును హిందూసమా
జమునఁ బ్రబలముకాలేదు. దీనియొక్క మూలమును గనుగొ
నఁ బ్రయత్నింతుమేని ఐరోపీయ సభ్యసమాజముల నాగరికత
కును బ్రాచీన భారతసమాజముల సభ్యతకును నొక ప్రభేదము
కనఁబడఁగలదు. వర్తమానపుఁ బాశ్చాత్యసభ్యత వైషయికసు
ఖప్రధానమయినది. దేనివలన మానవులు దినయాత్ర నిర్వ
హించుట కనుకూలము లొనఁగఁబడవో, శారీరక స్వాచ్ఛందత
వృద్ధి కానేరదో, కాయికక్లేశము కొఱతపడదో, ధనసంపాదన
మునకు నూతనమార్గములు తెరువఁబడవో, లేక తుదకు ధనార్జ
నమునకు నూతనమార్గము కనఁబడునట్టి సంభావనయయినను
లేదో, అట్టి విషయములయందుఁ బాశ్చాత్యదేశవాసులు శ్రద్ధ
వహించుటలేదు. వారియొక్క విజ్ఞానచర్చయు, సాహిత్యచర్చ

యు, రాజనైతికచర్చయు, నింక నానావిధములగు చర్చలయొక్క యుద్దేశము నైహికసుఖవృద్ధియే. ఇంగ్లాండుదేశమున నీవిషయతృష్ణ మిక్కిలి ప్రబలము. ఈదినమున జ్యోతిషశాస్త్రమున నొక నూతనసత్యము ఆవిష్కృతమగునెడల, ఒక నూతనవనియమము తెలిసికొనఁబడినయెడల వెంటనే యాంగ్లేయపండితులు తత్కాలమున వాణిజ్యమున కెంతయనుకూలము గలుగునని యాలోచించుటకై కూర్చుందురు. జడపదార్థముయొక్క యేదైన నొక నూతనశక్తి ప్రకాశమగునెడల నందువలన నేదయిన నూతనవ్యవసాయము (తెరుచుటకు) ప్రారంభించుటకు వీలగునా కాదా యని వారు చింతింతురు. కావున నైరోపాదేశముయొక్క సభ్యత విషయసుఖప్రధానమయినది. ఇఁకఁ బ్రాచీన భారతవర్షమునందలి సభ్యత నీతిప్రధానమును ఆధ్యాత్మికమును నయినది. ప్రాచీనకాలమునందలి దర్శనశాస్త్రములు, పురాణశాస్త్రములు, ఇతిహాసములు, అన్నియును మానవులను ముక్తినిఁ బడయుటకు సమర్థులనుగఁ జేయుటయే యుద్దేశముగాఁ గలవి. ముక్తియనఁగా నేమి యనుప్రశ్నములకు నుత్తరమొసంగుటకే షడ్దర్శనము లేర్పడినవి. ఇతరదేశములలో నేవిని చట్టములందురో వానికే భారతవర్షమున ధర్మశాస్త్రములని పేరు. దీనివలననే మనము ప్రాచీన భారతీయసమాజమునందు ధర్మముప్రతి యెంత యనురాగముండెడిదో తెలిసికొనవచ్చును

భారతీయసభ్యత నీతిప్రాధాన్యమును ఆధ్యాత్మికభావాపన్నమును అగుటకుఁ గారణ మేమి? ఈప్రశ్నమును నాలోచించుటకుఁ బ్రవృత్తులమయినయెడల బ్రాహ్మణులు అనన్యకర్ములయి కేవలము ధర్మచర్చయందును, ధర్మచింతయందును, ధర్మయాజనమందును, ధర్మప్రచారమందునుఁ గాలమును గడపుచుండెడివారనియు, మనము తెలిసికొందుము. మఱియు సంఘమునందు వారియొక్క ప్రభుత్వ మందరిపయి వ్యాపించియుండియుండుటను ఆకారణమున వారి యాధ్యాత్మికభావముయొక్క ప్రతిబింబమే సమాజముపై సమగ్రముగ దృఢరూపమునఁ జిత్రింపఁబడినట్లును మనము తెలిసికొందుము. జాతిభేదముయొక్క నిబంధనలవలననే బ్రాహ్మణులు అనన్యకర్ములయి ధర్మచర్చయందే తమకాలమును గడుపఁగలిగిరి; అట్టి ప్రాచీనసమాజమునందు జాతిభేదమే లేకుండినయెడలఁ గార్యవిభాగ మేర్పడుటకు వీలుండెడిదికాదు.

దీనికి నుత్తరముగా శ్రమవిభాగము (division of labour) ను గార్యవిభాగమును (division of duties) వర్తమానకాలమునందు సకల సభ్యసమాజములయొక్కయు, ప్రధానలక్షణములనియే. అట్టిశ్రమ విభాగముద్వార సకలవిషయములందును ఆశ్చర్యకరమగు నున్నతిని మనము గాంచుచున్నాము. ఒక తెగవారు విజ్ఞానచర్చ చేయుచున్నారు. మఱియొక శ్రేణికి సంబంధించినవారు శిల్పసాహిత్యము ననుసరించుచున్నారు.

మఱియొక సంఘమువారు ధర్మప్రచారమును గావించుచున్నారు. ఈవిధముగా నెవరి ద్వారములును మూయఁబడకయే మానవులు స్వేచ్ఛాక్రమమున వివిధకార్యముల నవలంబించుచున్నారు. కావునఁ బ్రాచీన భారతసమాజమునందు జాతిభేదమే కార్యములను జేయుచుండెనదో, ఆకార్యముల నొనరించుటకై వర్తమానసమయమున నట్టి యాచారముయొక్క యగత్యము కనఁబడుటలేదు.

పైఁగనిన యాంగ్లగ్రంథకర్త చెప్పిన రెండవలాభమేమనఁగా, జాతిభేదమే లేకుండినయెడల భారతవర్షమునందలి జాతులన్నియును విదేశీయజాతుల సంసర్గమున వచ్చుటచే నాశనమొందఁగలవని. ఇందునకు దృష్టాంతము నీలగిరులలోనుండెడి తోడాజాతివారే. ఈతోడాజాతివారిలో జాతిభేదములేని కారణమున వారు తక్కువజాతి ఐరోపీయులతోఁ గలసి క్రమముగా నాశనమును జెందుచున్నారని యాగ్రంథకారుని యాశయము. ఈవిషయమై కొంత చెప్పవలసియున్నది. తోడాలు నిశ్శేషముగుటకు వారలయొక్క కాని యుక్తజాతులవారియొక్క కాని సోమరితనమును, బుద్ధిసంబంధమయిన హీనత్వమును, అప్రయోజకత్వమును గారణములు గాని, వారలలో జాతిభేదము లేకపోవుటకాదు. మఱియు వారు జీవనసంగ్రామమున నితరజాతులవారిచే వెనుకఁ ద్రొక్కఁబడి, దినదినమునకును ఘోరదారిద్ర్యమునకు వశులగుటచే క్రమముగా సంఖ్యయం

దుఁ దగ్గుచున్నారు. ఈకారణముననే డార్జిలింగునందున్న లేప్చాలనెడివారి సంఖ్యకూడఁ దగ్గుచున్నట్లు తోఁచెడిని. మఱియొకవైపునుండి బర్మాదేశస్థుల దృష్టాంతమును జూడనగును. బర్మాదేశీయులలోను జాతిభేదము లేదు. బర్మాదేశపు స్త్రీలలో నెవరయిన నొక యైరోపీయుని వివాహమాడుట తటస్థించిన యెడల నామెను జాతినుండి బహిష్కరించరు. ఒకవేళ నామెకు వైధవ్యము సంప్రాప్తించినను, లేక మఱియేకారణముచేనైన వివాహబంధము భిన్నముగాఁబడినయెడల నాస్త్రీని మరల నామెయొక్క జ్ఞాతి కుటుంబమునందు నిరాటంకముగా జేర్చుకొనుచుందురు. ఈవిధముగా ననేకైరోపీయులకు బర్మాదేశపు భార్యలు, బర్మాదేశీయులలోఁగలరు. ఈకారణమున బర్మాదేశీయులేవిధమయిన నాశనమును బొందుటలేదే ?

ఏదియెట్లుండినను మన మిపుడు జాతిభేదమువలన మన దేశమునకు వాటిల్లిన యనిష్టములను గూర్చి యొక్క పర్యాయ మాలోచించి చూతము.

౧. మొదటియనిష్టము. ఈయాచారము భారతక్షేత్రమున విచ్ఛేదము. అనాత్మీయతయనెడి బీజములను వెదఁజల్లుటచే "మనుష్యుఁడు మనుష్యునికి సోదరుఁడు" అనునట్టి మహాసత్యము భారతవాసులయొక్క హృదయమునఁ బ్రకాశింపలేకపోయినది. ఈయాచారముయొక్క నిబంధనల మూలము

వనే యొక్క ప్రదేశమునకే చెందినట్టియుఁ, దుద కొక్క జి
ల్లాకే సంబంధించినట్టియు, వేర్వేరు జాతులవారి యాచారవ్య
వహారములు వేర్వేరుగా నుండుచుండుటచే నొకరితో నొకరికి
సాంఘిక సంబంధముగాని, సంబంధ బాంధవ్యములుగాని, వృ
ద్ధియగుటకు వీలులేకున్నయది. ఈపట్టణమునందలి బ్రాహ్మణు
లును, కాయస్థులును సువర్ణవణిజులు నేవిధముగ నసహ్యించు
కొనుచున్నారో కొంచె మాలోచించి చూడుఁడు? కుల భేదము
ననుసరించిన యసహ్య మెచటనుండునో యచట బంధుత్వము
కలియు టెట్లు? మఱికొంచెము దీర్ఘముగా నాలోచించిన దేశ
మెట్టి శోచనీయావస్థలో నుండియున్నదో తెలియఁగలదు. ఇరు
వదినాలుగు పరగణాలకుఁ జెందినవారు మేదినీపురముజిల్లాలో
నుద్యోగార్థమై వెడలుట తటస్థించినయెడల, నచటి వారిని వా
రసహ్యముతోఁ జూతురు; బంగాళీలు బేహారులోనుండుట త
టస్థించినయెడల బేహారులను జూచి యసహ్యపడుదురు; పం
జాబులోనున్న బంగాళీలను, పాంచాలవాసులు చిన్న చూ
పుచూతురు. ఇఁక బంగాళీలన్ననో పంజాబీలను దమకంటె
హీనులుగాఁ దలఁచి వారి నవజ్ఞచేయుదురు. ఈవిధముగా జను
లలో నెంత యమిత్రతకలదో, ఏవిధముగా జాతిగతమయిన
ట్టియు, శ్రేణీభుక్తమయినట్టియు విద్వేషము గలదో, దాని
కంతటికిని మూల మీ జాతిభేదమే. రెండు తెగలవారి మధ్య
నన్యోన్యభావము విలసిల్లుటకు వివాహమనునది యొక ముఖ్య

మైన సాధనమని మీరు సులభముగా గ్రహింపఁగలరు. ఇతి
హాసము వైపు మీదృష్టిని గొంచెము పోనిచ్చినయెడలఁ బ్రా
చీన రోమకరాజ్యమునందు, రోమనులకును వారిప్రతిపక్షులగు
స్యాబియనులకును నెట్టిశత్రుత్వముండెడిదో మీకుఁ దెలియఁ
గలదు. కాని యెప్పుడు రోమకయువజనులు శత్రుపక్షమునఁ
జేరినఁ గొందఱు స్త్రీలను హరించి వారిని వివాహమాడుటకు
మొదలుపెట్టిరో యప్పుడే యాస్త్రీలద్వారా శత్రుపక్షము
వారితో సంధిపొసఁగి, చుట్టఱికమును గలిసినది. దీనికై యితి
హాసములనుగూడఁ జూడనక్కఱలేదు. ఏదైన రెండుగ్రామ
ములవారిమధ్య విశేషముగా వివాహసంబంధములు వెలసెనేని
వారిలో నెట్టియనురాగము వృద్ధియగునో మీరు తరుచుగాఁ
జూచుటలేదా? ఏగ్రామములో నాపిన్నతల్లియో, మేనత్తయో
లేక నాతోబుట్టువో మొదలుగు పదిమంది సమీపబంధువు లుం
డునెడల నాగ్రామము నాకెంతయు బ్రియమగుటయు నాగ్రా
మవాసులపై నాకు సద్భావముగల్గుటయు స్వాభావికమేగదా?
అట్టి సద్భావ మీజాతిభేదమువలననే కదా భారతవర్షమున వర్ధి
ల్లుటకు వీలులేకున్నది? ఏస్థలమున సౌహార్దము విలసిల్లదో ఆ
స్థలమునందలిజనులయొక్క కష్టసుఖములను మనవిగాఁ దలఁచు
కొనఁజాలము. చెన్నపట్టణమున నేఁడు క్షామముచేతనో లేక
మహామారిచేతనో జనులు విశేషముగాఁ జనిపోవుచున్నారని
మీరు వినుట తటస్థించినయెడల స్వదేశముగదాయని మీరం

దరును సాధారణభావముతోఁ గొంచెము దుఃఖమును జెందవచ్చును, కాని నాకుమాత్రము మిక్కిలి యాఘాతముకలుగును; కారణమేమనఁగా నాకచ్చటఁ దెలిసినవారును, స్నేహితులును, నాతో నెక్కువమైత్రిని సల్పువారును నుండియున్నారు. ఈ దుఃఖమే యచ్చట నాపినతల్లులిద్దరును, నాచెల్లెండ్రిద్దరును, నామేనత్తలిద్దరును నుండుట సంభవించినయెడల మఱింత యధికమౌనుగదా! దీనిని మీరందరును సులభముగ గ్రహింపఁగలరు. కావున నెచ్చట నాత్మీయత విలసిల్లునో యచటనే సమదుఃఖసుఖతాభావమును నెగడొందును. కావున జాతీయభేదాచారము భారతీయజాతులమధ్య నన్యోన్యానురాగమును వృద్ధి కానియ్యలేదు. ఈ పరస్పరమైత్రియు, నైకమత్యమును నభావమగుటయే భారతవాసులదుర్గతికిఁ బ్రధానకారణము లయినవి; ఇందువలననే భారతవర్షమింతసులభముగ విదేశీయులచే దాసత్వపాశమున బంధింపఁబడినది.

ఒకపర్యాయము నేను పంజాబుదేశమునకై ప్రయాణముచేయుచున్నకాలమున నొక యైరోపీయోద్యోగునితో భారతవర్షముయొక్క భావిస్థితినిఁగూర్చి సంభాషించుట పొసఁగినది. ఆ యైరోపీయోద్యోగస్థుఁడు నన్నుఁజూచి "నీవు వంగదేశీయుఁడవు కాఁబోలును" అని యనెను.

నేను "అవును; పంజాబుదేశమున యాత్రచేయు నుదేశముతో వచ్చుచున్నాను" అని యంటిని. అప్పు డాతఁడు

"మంచిది, మనము మీదేశముయొక్క భావిస్థితినిఁగూర్చి ముచ్చటింత" మని చెప్పెను.

అందునకు బదులు "ఈవిషయమునుగూర్చి మనలో విశేష మభిప్రాయభేదముగలిగి మన సంభాషణాసుఖమునకు వ్యాఘాతముకల్గును గనుక దీనిని వదలిపెట్టిన బాగుగనుండదా" అని నే నంటిని.

"నాయుద్దేశమును వివాదమాడుటకాదు" అని యాయన మరల ననెను.

అప్పుడు నేను "మీరు మాకు నాంగ్లేయవిద్య నిచ్చుటవలన మాహృదయములలో స్వాతంత్ర్యముయొక్కయు, స్వాయత్తశాసనముయొక్కయు నాకాంక్ష లుదితమయినవి" అని యంటిని.

ఆయన కొంచెము నవ్వి "అనఁగా మే మెప్పు డీదేశమునువదలిపోవుదుమో యాదినములకై ప్రతీక్షించుచుంటిరా" అని యనెను.

నేనును నవ్వుచు "అందునకు సందేహమేమి" అని యంటిని. అప్పుడు "మంచిది మీరు మమ్ములను మీదేశమునుండి వెడలఁగొట్టఁగలరనెడి సంభావనయైనను గలదా" అని ప్రశ్నించెను.

"లేదు; రెండు మూడువందల సంవత్సరములలోపుగా నట్టిది సంభవము కానేర" దని యంటిని.

అప్పు డాయన "మీలో బాహుబలశాలురును, సమరకుశలురును లేరని కాదు, చూడుఁడు, మేము మీదేశజనుల ద్వారా మిమ్ములను శాసనమునందుంచుచున్నారము. మీరు బలములేని కారణముచే మాయధీనమున నుండుటలేదు, కాని మఱియొక కారణము కలదు, మిమ్ముల నొక్కటిగాఁ గూర్చుటకు వీలులేనట్టి యొకవిషయము మీమధ్యఁ గలదు. ఆకారణమున మీరు మమ్ములను వెడలనడఁపలేరు" అని యనెను.

"ఆవిషయమేమని" నేను ప్రశ్నించితిని.

"అది జాతిభేదమే" అని యాయన చెప్పెను.

"ఈ యాచారమున్నంతకాలము మమ్ముల నీదేశమునుండి వెడలనడుప నెవరితరము?" అని కూడఁ బల్కెను.

వాస్తవముగా నీజాతిభేదదురాచారమువలన భారతీయజాతులమధ్య నాత్మీయతయును, సమదుఃఖసుఖతాభావమును వర్ధిల్లకపోవుటచేతనే భారతవాసుల కిట్టిదౌర్బల్యము సంఘటిల్లినది.

౨. రెండవయనిష్టము. ఈ యాచారముద్వారా కాయికశ్రమసాధ్యములగు పనులన్నియు నికృష్టములుగా జనులచేఁ జూడఁబడుచు హేయములని తలఁపఁబడుటయే రెండవయనిష్టఫలము. ఈదేశమునఁ జిరకాలమునుండియుఁ గాయకష్టమును హీనజాతులవారే చేయుచువచ్చుచుండిరి; బ్రాహ్మణాదియుగ్రవర్ణములవా రట్టిపనులు తమకు యోగ్యమైనవికావని

పరిత్యజించుచుండిరి. దేశమునం దిట్టియాచారము ప్రచలితమగుటం జేసి కాయికపరిశ్రమములపైని గౌరవనీయులగు జనులకందఱికిని ద్వేషము బద్ధమూలమైయుండెను. ఈకారణముచేతనే యీదేశమునందు విద్యవలనఁగాని మఱియేకారణముచేఁగాని జనులయొక్క స్థితి కొంచెము బాగుపడినంతమాత్రమున వారును తమపుత్రపౌత్రాదులును గాయికపరిశ్రమముల నసహించుకొనుటను మనము చూచుచున్నాము. ఈవ్యాధి యెంతవఱకు వ్యాపించినదనఁగా—బ్రాహ్మణ లేక కాయస్థకుటుంబమునకుఁ జేరిన మనుజుఁడు అర్థాభావముచేత సపరివారముగ నర్ధభుక్తముతోనైనను గాలమును గడపుకొనునుగాని, ఏమాత్రమును గాయికపరిశ్రమముద్వారా ధనము నార్జించుటకుమాత్రము సమ్మతింపఁడు. ఇఁక బ్రాహ్మణులమాట చెప్పవలసినదేలేదు. ఎవ్వరైనను నొకబ్రాహ్మణభిక్షుకుని వెళ్లిపొమ్మని చెప్పినయెడల అతఁడు "మహాశయా, బ్రాహ్మణుని సంతానమగుటచే శ్రమపడియయినను బొట్టనింపుకొనలేను, కావున భిక్షమెత్తి బ్రతుకవలసివచ్చె. యాచనమువలన బ్రహ్మణునికి లజ్జయేమిటి?" అని చెప్పెను. ఎంతఘోరమో చూడుఁడు! ఏదేశమునందు మనుష్యునకుచితమగు కాయికపరిశ్రమమునకంటె భిక్షుకవృత్తియే ప్రశంసార్హమైనదో యట్టిదేశమును దుర్గతినుండి రక్షించుట కెవరిసాధ్యము? ఓ భారతీయ యువజనులారా! మీ కెంతకాలము సావానముగలిగినట్టియు, కష్టసాధ్యము

నట్టియు, స్వాధీనచిత్తముగల మనుష్యులరీతి మీమీ దేహముల నుండి చెమ్మటలూడ్చి మీస్వంతాన్నమును సంపాదించుకొనుటకు నేర్వరో, జగదీశ్వరుఁడు మీకుఁ బ్రసాదించిన బాహుద్వయములను, పదద్వయములను, మస్తిష్కమును నుపయోగించుటచే మీయున్నతికొఱకై ప్రయత్నించరో, యంతవరకును మీయొక్క దుర్గతి మిమ్ములను వదలనేరదు. ఈదేశమున బ్రాహ్మణులయొక్క ప్రతాపము యెంతకాలము ప్రబలముగ నుండెనో, అంతకాలమును శ్రమజీవులున్నతినిబొందియుండ లేదని దేశచరిత్రమును జూచినయెడల మీకు బోధపడఁగలదు. ఈదేశమునకుఁ గనఁబడు నాశ్చర్యమును గీర్తినిఁ బ్రకటించునట్టి శిల్పకలాచాతురిలో జ్యేష్ఠాంశము బౌద్ధరాజుల రాజత్వకాలముననే సంపాదితమయినది. అనఁగా నెప్పుడు బ్రాహ్మణులప్రతాపము సన్నగిలుటకు ప్రారంభించెనో, అప్పుడే శ్రమసాధ్యములగు శిల్పములన్నియు యున్నతిని జూపుచువచ్చినవి.

3. మూఁడవ యనిష్టము—జాతిభేదమువలనఁ గలిగిన మూఁడవ యనిష్టమేమనఁగా భారతవర్షమును దరిద్రవంతముగఁ జేయుటయే. ఈయాచారమువలన సముద్రయాత్ర నిషేధింపఁబడినది; కావున వాణిజ్యమభివృద్ధినొందుటకు వీలులేకపోయినది. సముద్రయాత్ర చేయకయే నేటివరకు యేదేశమైనను యెప్పుడైనను వాణిజ్యమున నున్నతినిఁ బడసినదా? బొం

బాయినగరమునకుఁ బోయి చూచినయెడల నీదేశీయులు యెన్నిబట్టలనేయు యంత్రశాలలను నడపుచున్నారో. తెలియఁగలదు. వారు ప్రతిదినమును రాసులు రాసులుగా నూలు లడ్డీలను తయారుచేసి తమ కార్ఖానములయం దుస్థూపాకారములుగ పేర్చుచున్నారు. కాని యానూలంతయు నెచ్చట విక్రయమగుచున్నది? ఏల బొంబాయిలోనేగదా యదంతయు విక్రయమగుటకు దానిని కొనువారెవరు? అడుగవలయునా? ఐరోపీయవర్తకులీనూలును గ్రయముచేసి, చీనా, జపాన్ మొదలగు దేశములకుం గొనిపోయి విక్రయించుచు వచ్చుచున్నారుగదా! ఒకఁడు నూలునుఁ దయారుచేసి యుంచిన మఱియొకఁడువచ్చి దానినే యింకొకరికి విక్రయించి లాభమును సంపాదించుకొని పోవుచున్నాఁడు. జాతిభేదముండుటచేతనే మొదటివా రాలాభమును బొందలేకపోవుచున్నాఁడు. ఇందువలననే భారతవాసులకింత దారిద్ర్యము.

౪. నాల్గవ యనిష్టము—ఈదేశజనులయొక్క శారీరకమానసికదుర్బలత్వమునకును గారణ మీజాతిభేదమే. దీనివలననే మనవివాహసంబంధము సంకీర్ణమునుండి సంకీర్ణతరమగు సీమాబద్ధమయి పోవుచున్నయది. కావున రక్తసంమిశ్రమగుటకు వీలులేదు. ఏదైన నొక స్వల్పపరిసరక్షేత్రమధ్యముననే క్రమాగతముగ వివాహములు జరుగుచువచ్చినయెడల నట్టిజాతులు త్వరగా హీనతేజస్కులయి కాలక్రమమున నుత్సన్న

వశమును ప్రాప్తించు ననునది ప్రాణిజగత్తున పరీక్షింపఁబడి తెలిసికొనఁబడిన యొకసత్యము. రెండుజాతులను బెంచుట కారంభించి మఱియేయితరజాతులతోను కలియుటకు వీలులేనట్టి స్థలమునకుఁ దీసికొనిపొమ్ము. ఈరెంటియొక్క సంతతిని మఱియేయితరజాతులతోను, గలుపకయే వానిమధ్య సంతతి యభివృద్ధికానిమ్ము. కొన్నితరములయినతరువాత వానికిఁగలిగిన పిల్లలు మిగుల దుర్బలమగుటయును, నిస్తేజమగుటయును జాతువు; మఱికొన్నితరములకుఁ దరువాత వానివంశముకూడ నభివృద్ధియగుట నిలిచిపోవుటను జాతువు. రక్తసంమిశ్రమము లేనికారణమున శారీరకదుర్బలత్వము సంఘటిల్లుననునది విజ్ఞానముయొక్క సిద్ధాంతరీకరింపఁబడిన సత్యము. కాఁబట్టి యీవిషయమై విశేషముగఁ జెప్పనక్కరలేదు. మఱియొకవైపు నాంగ్లేయజాతివారిని చూడుఁడు. వారియొక్క బలవిక్రమములకును, ర్యపరాక్రమములకును గారణమేమో యాలోచింపుఁడు. ఇంగ్లాండుదేశమంతయును హిందూదేశముతోఁ బోల్చిచూచిన నెంతసామాన్యమైన స్థానము! విస్తారమును బట్టిచూచిన దానిలోని యొకప్రదేశమునకైనఁ జాలదు. అయినప్పటికిని నీ సామాన్యద్వీపమునందు వాసముచేసెడి జాతులయొక్క శౌర్యవీర్యము లెట్టివో గమనింపుఁడు! కేవలము ప్రకాండమైనట్టి యీభారతసామ్రాజ్యము వారిచేత సుచారురూపమున పాలింపఁబడుచుండుట మాత్రమేకాదు. వీరిభయముచే జగత్తునందలి

బలవంతులగు జాతులవారందరు నెల్లప్పుడును, సశంకితులగు వీరిని నలక్ష్యముచేసి జర్మనీచక్రవర్తి యేకార్యమును దలపెట్టెడివాఁడుకాఁడు. వీరియొక్క కనుబొమ్మలను జూచినంతమాత్రమున ఋషియాచక్రవర్తి సింహాసనమునఁ గూర్చుండియే కంపించును. భారతవర్షమేవిధముగ శాసింపఁబడుచున్నదో యాతీరును నొక్కపర్యాయము చూడుఁడు. ఇంగ్లాండునందు గ్లాడ్‌స్టన్, బ్రైట్ మొదలగువారు ప్రథమశ్రేణికిఁ జెందినవారు; వారీదేశమునకు రావలయునని స్వప్నములోనైనను తలఁపరు; రెండవశ్రేణికిఁజెందిన ఫాసెట్ మొదలగువారొకరిద్దరు గవర్నర్ జనరల్ పదవినిగ్రహించి మనదేశమునకు వచ్చుచుందురు. తృతీయశ్రేణికిఁజెందినవారు సహా మనదేశమునకు రావలయునని యనుకొనరు. కేవలము నచ్చటి నాల్గవ, అయిదవ శ్రేణులకుఁ జెందినవారు మాత్రమే సివిల్‌సర్వీసులోఁ బ్రవేశించి యన్నిపనులను స్వీకరించి మనదేశమునకు వచ్చుచుందురు. మనదేశమునందు సమస్తకార్యములును జేయువారును, నిరాకరించువారును, రాజులను బంకమట్టిబొమ్మలవలె నేఁడు సింహాసనమెక్కించి రేపుదింపువారును, సకలరాజకార్యములను సుచారురూపమున నడపువారును నీ పంచమశ్రేణికిఁజెందినవారే. ఇది చూచుటకు వింతయయిన విషయముకాదా? దీనివలన నింగ్లాండుయొక్క బలము తేటపడుటలేదా? ఏదేశమునందలి యయిదవరకము మనుష్యులింతశక్తివంతులును, విక్రమశీలురో? యట్టి

దశ యెంతటిఘనతనైనను బడయఁదగును. కాని యాంగ్లేయు లిట్టి తేజోవంతులును మానసికశక్తియుతులునగుటకు మూలమేమి? వారి రక్తమే కదా? నిర్భీకతయు, ఉద్యోగితయు, కర్మకుశలతయు, శ్రీమదక్షతయు, అధ్యవసాయమును, స్వాధీనచింతయు మున్నగుగాఁగల గుణములన్నియు విశేషపరిమాణము శారీరబలమునే యాధారముగఁ జేసికొని యుండుననెడు విషయమును మనము తరుచుగా మఱచిపోవుచుందుము. ఈసందర్భమున నాకొక పౌరాణికకథ జ్ఞాపకమునకువచ్చుచున్నది. ఒకపర్యాయము దేవతలందరును నేదోయొక రాక్షసుని యుపద్రవముచే మిక్కిలి యుత్యార్తులయిరి. ఆదానవనిపాతమునకై తుదకందరును విష్ణువును శరణుజొచ్చిరి. అప్పుడు దేవతలందరును దమతమ యంశములను బంచియిచ్చుటచేత నమితతేజోసంపన్నుడగు నొక వీరపురుషుఁడు సృష్టింపఁబడవలసినటుల తీర్మానింపఁబడెను. ఇంద్రుఁడు తనలో మూఁడుభాగములను, యముఁడు మూఁడుభాగములను, వాయువు, వరుణుఁడు మొదలుగాఁగల మిగిలిన దిక్పాలకులందరును దమతమ యంశములనుండియుఁ గొంతనిచ్చిరి. ఈసకలయంశములనుండియు నొకమహాశక్తి యుదయించినది. ఆశక్తియే యా దానవుని సంహరింపఁగలిగినది. ఇట్టికథను మీరు నిశ్చయముగా ననేకపర్యాయములు వినియుందురు. ఆంగ్లేయజాతియొక్క జన్మము నీవిధమే. ప్రథమమున శాక్సన్ జాతి, డినేమార్క్ జాతి, నార్మన్ జాతి మొదలగు నింకను నానా

జాతులవారితో సమ్మిశ్రితమయి వారొక మహాజాతిగాఁ బరిణమించిరి. అటుతరువాత వారలలో నిప్పటికిని వివాహవిషయమైన కుసంస్కారము లేవియు లేవు. వీరెచ్చటికిఁబోవుచున్నారో యచ్చట వివాహసంబంధముల నెఱపుకొనుచున్నారు. ఆంగ్లేయుఁడు ఫ్రాన్సుదేశమునకుఁ బోవుచున్నాఁడు, అచ్చటినుండి యొక ఫరాసీరమణిని గృహమునకుఁ దెచ్చుచున్నాఁడు, ఇటలీదేశమునకుఁ బోయిన నిటాలియారమణినిం గొనివచ్చుచున్నాఁడు. ఈవిధముగ నాంగ్లేయసమాజమున నవనవరుధిరస్రోతములు ప్రవహించుచుండును. కావున నానాశక్తులును నొకచో సమావేశమై వీరిని శక్తిశాలురనుగ జేయుచున్నవి. వీరిభాష యేవిధముగా నానాభాషలనుండి శబ్దములనుగ్రహించి యున్నతిఁ బొందుచున్నయదో వీరిదేహమనములును నదేవిధముగ నానాజాతులయొక్క శక్తులను, గుణములనుగ్రహించి మిగుల బలవత్తరము లగుచున్నవి.

౫. ఆయిదవ యనిష్టము. ఈజాతిభేదాచారము బహుశతాబ్దములనుండియు వచ్చుచు మనయొక్క యున్నతిమార్గమును నిరోధించుటకొక కఠినమైన యర్గళ (గొళ్లెము) రూపముగఁ బరిణమించినది. ఏవిధముగ చీనాదేశస్థులు తమరాజ్యముచుట్టును నొకరాతిగోడను నిర్మించుటచే బయటినుండి వెల్తురుగాని, యున్నతిస్రోతమునుగాని, చింతలనుగాని యనేకశతాబ్దములనుండియుఁ దమరాజ్యమునఁ జొరకుండునట్లు చేసికొనిరో, యదేవిధ

ముగ హిందువులును జాతిభేదమనెడి యొకయాధ్యాత్మిక ప్రాకారము (గోడ) ద్వారా తాము కట్టువడినవారై సకలవిధములగు నున్నతిమార్గములకును గొళ్లెమును దగిలించిరి. ఈ కారణముచేతనే జపానుదేశస్థులు గడచిన ముప్పది సంవత్సరములలో రాజనీతియందును, సామాజికనీతియందును మొదలగు మఱియనేకవిషయములయందును నెంతయో యభివృద్ధిఁ జెందియుండ గడచిన నూటయేబది సంవత్సరములకంటెను మించినకాలము ఆంగ్లేయరాజ్యమున వాసముచేయుచుండియు నీదేశవాసులు అట్టి యున్నతిని పొందలేకపోయిరి. ఏమి యాశ్చర్యము! ఈభారతవర్షముపైనుండియే యెన్నియో ప్రవాహములు వచ్చి పోవుచున్నవి. ఇచ్చటనే మహాత్ముఁడగు బుద్ధదేవుఁడు నవధర్మమును బ్రచారముచేసెను. ఇచ్చటనే ముసల్మానులు శస్త్రపాణులయి తమ మతమును బ్రచారముచేయుటకుఁ బ్రయత్నించిరి. ఇచ్చటనే నూరులకొలఁది క్రైస్తవప్రచారకులు దివారాత్రములు పరిశ్రమచేయుచు వారిదేహములందలి రక్తమెండిపోవునటులఁ బనిచేయుచున్నారు. కాని యెవరును ఈసావరతుల్యములగు అచలిష్ణువులగు, ఘనీభూతములయిన ప్రాణిపుంజములను ముందుకు నడిపించలేకపోయిరి. దీనికిఁ గారణమేమి? ఈ జాతిభేదమే దీనికి గారణము. జాతిఖడ్గమనునది మస్తకముపై దోదూల్యమానమగుచుండ నెవరు కాలును ముందుపెట్టఁగలరు? ఈదేశవాసులగు స్త్రీపురుషుల కంఠములలో నీజాతిభేద

మనెడి సంకెల లింతదృఢముగాఁ గట్టఁబడకయుండినయెడల, ఈ దేశముయొక్క రక్షణశీలత (Conservative spirit) యింత యధికముగ నుండునది కాదు.

౬. ఆఱవయనిష్టము. జాతిభేదమేవిధముగ నీదేశవాసులను రక్షణశీలురుగను, ఉన్నతిపరాఙ్ముఖులుగను జేసెనో, దానితోఁబాటు మనయొక్క మనుష్యత్వమునుగూడ హరించివేసెను. ఈమాటలన్నియు హృదయమునందలి గురుతరమైన దుఃఖముచేతను మనస్సంక్షోభముచేతను జెప్పుచున్నాఁడను. మానవాత్మల నున్నతివిషయములో సహాయముచేయుటకే జనసమాజమేర్పడుట. ఏసమాజమున వసించుచు నేను జ్ఞానమునందును, ధర్మమునందును వర్ధిల్లఁగలనో, ప్రేమయును, పవిత్రతయును బడయఁగలనో, కర్తవ్యపథమున నిరాటంకముగ ముందునకు నడువఁగలనో, స్వాధీనభావముతోడను, అసంకోచముగను, నిర్విఘ్నముగను నాదేహమనః ప్రాణశక్తులను ఈశ్వరుని ప్రియకార్యసాధనములను సాధించుటయందు నియోగింపఁగలుగుదునో యట్టి సమాజమే ఈశ్వరుని యిచ్ఛానుగతమైనది. కాని యట్లుకాక జనసమాజమెప్పుడు ప్రపీడనమొనరించునదియు, నత్యాచారము లొనరించునదియు, నిరాటంకముగ స్వీయకర్తవ్యములను బాలించుటకు నియ్యకొననిదియు నగునో, ఎప్పుడు సరళమైన ధర్మపిపాసగల మా[illegible]లను దొంగలవలెను, దారిదోపిడిగాండ్రవలెను జూచుచు వారిని దండించుటకుఁ బూ

నికొనువో, ఎప్పుడు వారిమధ్య స్వతంత్రభావముతో నంతరాత్మయొక్క బోధనల ననుసరించి ప్రవర్తించుటకు వీలుండదో తమయొక్క ఆత్మగౌరవమును, మానుషత్వమును గాపాడుకొనుటకు ననుకూలము లుండవో యప్పుడే యట్టివికృతపుసమాజము వ్యాధిగ్రస్తమయిన దేహమువలె మానవాత్మ నివసించుటకు నయోగ్యమగుచున్నయది. ఈజాతిభేదమువలన హిందూసమాజమున కిట్టి దురవస్థతటస్థించినది. హా! కష్టా! దీనివలననే మన పురుషులు కాపురుషులగుచుండుట. జాతిపోవునను భయముచేత జనులు తమకర్తవ్యపాలనమునకే పరాఙ్ముఖులగుచున్నారు. విద్యావంతుఁడగు నొకగృహస్థునియొక్క యెనిమిదవ సంవత్సరముల ప్రాయముగల నిరపరాధియగు బాలికకు వైధవ్యము ప్రాప్తించుటను జూడుఁడు. సుకుమారవతియు, సరళస్వభావముగలదియు నైన యాబాలిక సాంసారికసుఖదుఃఖములన నేమియో యెఱుఁగక యాడుకొనుచుండఁ దటాలున దానితండ్రి దేశాచారమునకు వెఱచి యాబాలికనుపట్టి వివాహమునుచేయుటయు, నొక సంవత్సరమున గడచియు గడువకమునుపే దానికి ఘోరవైధవ్యము ప్రాప్తించుటయు జూడుఁడు. ఇప్పుడే నాబాలికకు నవయౌవనము సంప్రాప్తమగుట. అమాయకమును బ్రస్ఫుటితమును, ఆనందముతోఁగూడికొనిన యామెయొక్క ముఖమునుచూచినపుడెల్లను తండ్రి రహస్యముగఁ గన్నీరు కార్చుచుండును. అతనియొక్క హృదయము ప్రాణము ధర్మజ్ఞా

నము అన్నియును నామెను బలవంతముగాఁజిర వైధవ్యమున నుంచుట సరిగాదని చెప్పుచుండినను నతనికి సాహసముమాత్రము చాలకపోవుటకుఁ గారణమేమి? జాతిపోవుననియెడి భయమేకదా? జాతియనునది యొకటిలేకపోయినచో, నలుగురు కూడి యొకనికి నింతకష్టమును గలుగఁజేయుటయనునది లేకపోయినచో, నీబాలికయొక్క సాంసారికసుఖమునకు నాటంకము లేకపోవునదియేకదా? సంఘముయొక్క భయమువలన జనులలో మానుషత్వ మెట్లుఁగొఱవడుచున్నయదో నీకుఁ జెప్పవలయునా? జాతిభేదాచారమే లేకుండినయెడల సంఘమువలన భయ మింత లేకపోయెడిదియే.

౭. ఏడవయనిష్టము. ఈజాతిభేదయాచారమువలన వివాహసంబంధమైన యాచారవ్యవహారము లెంతవరకు కలుషితములయినవో యాలోచించి చూడుఁడు. భారతవర్షమున నెచ్చట హిందువులుగలరో యచ్చట బాల్యవివాహములు ప్రబలియుండుటకుఁ గారణమేమి? జాతిభేదమే దీనికి ప్రధానకారణములలో నొక్కటిగదా? బంగాళాదేశమునందలి బ్రాహ్మణులు ముఖ్యముగా రాఢీ, వైదిక, బరేంద్రబ్రాహ్మణులని మూఁడుతెగలుగ నున్నారు. వీరలలోఁ బరస్పరవైవాహిక సంబంధములు లేవు. వీరలమధ్య మరల కులీనులనియు, మౌలికులనియు, వంశజులనియు భేదములు గలవు. వీరలలోను బరస్పరవివాహసంబంధముల విషయమై కఠినసియమములుగలవు. ఈ

విధముగ కాలక్రమమున వివాహోపయోగ్యమగు స్థలము క్రమముగా సంకీర్ణమునుండి సంకీర్ణతరమగు సీమాబద్ధమగుచు వచ్చుచున్నయది. దీనికిఁదోడు ఒకగృహమునందు ఒకపురుషునికి వివాహమయినయెడల నాగృహమునందే యాతనిబిడ్డలయొక్క సంతతికి వివాహముచేసికొనుస్థలము మిక్కిలి తక్కువయగుచున్నయది. మఱియొకవైపు కన్యలను బదిసంవత్సరములకుఁ దరువాత వివాహముకాకుండ నుంచుట ధర్మశాస్త్రములయందుఁ గఠినముగా నిషేధింపఁబడినది. కావుననే కాలక్రమమున యథాసమయమునకు నుపయుక్తమగు వరుఁడు దొరకుట మిగుల దుష్కరమగుచున్నయది. అందుచేతనే కన్యలుగలవా రుపయుక్తమైన వరునిఁజూచినంతమాత్రమున వివాహమునకు సరియైనకాలము కాకపోయినప్పటికిఁ బెండ్లిచేసి యిచ్చుటకు బాధ్యులగుచున్నారు. కన్య పెద్దదై యొకవేళ నుపయుక్తమైన వరుఁడు లభించకపోయిన నప్పుడేమిచేసేది—కన్యనుంచుటకు వీలులేదుగదా? కాబట్టి యప్పు డుపయుక్తుఁడా అనుపయుక్తుఁడా యని విచారించుటకుఁ గూడ సమయముండదు; కావున సమయమున్నపుడే మంచివరుని నొకనిని జూచి మూఁడుముడులను బడనిచ్చినఁజాలును. గృహాను లీవిధముగ బుద్ధిప్రణోదితులయి పనులను చేసియుండిరి, చేయుచున్నారు. ఈ కారణముచేతనే కలకత్తాలోని దాక్షిణాత్యవైదికులలో సూతికాగృహమునుండి బయటికివచ్చిన కన్యకలకుసహా సంబంధము

లను వెదకు నాచారము ప్రచలితమయినది. ఈకారణముచేతనే కులీనబ్రాహ్మణులమధ్య కౌటుంబికజీవనమునకు కంటకమనఁదగు బహువివాహమనెడి (బహుభార్యాత్వము) యాచారము వాడుకలోనికి వచ్చినది. మఱియు నిదేకారణమువలననే యీదేశమునందలి సువర్ణవణికులు, వైద్యులు, కాయస్థులు మొదలగు సకలజాతులవారిమధ్యను కన్యావివాహములయొక్క ఖర్చులు మిక్కిలి యపరిమితములై వృద్ధిపడయుచున్నయవి. ఇటీవల నీవివాహవ్యయములంత యభివృద్ధియై అందుచే ముగ్గురుకన్యకలనుగల యొకానొకగృహస్థుడు వారినిఁబెండ్లిచేసి యిచ్చుటకై తన సర్వస్వమును అర్పించవలసివచ్చినది. ఇఁక నుపయుక్తమైనట్టియు, విద్యావంతులును, బుద్ధిమంతులును నగు పుత్రులుగల వారిలాభమునకు మేరలేదు. వారు తమపుత్రులను ఒక్కరొక్కరినిగా వేలముపాటపాడుచు విక్రయించి విశేషధనమును సంపాదించుచున్నారు. ఇట్టి సామాజికదౌరాత్మ్యము పైఁ గనినజాతులవారిమధ్య సహింపరానంతకష్టమును గలుగఁజేయుటచే వారీయనిష్టమును దొలగించు నుద్దేశముతో నప్పుడప్పుడు సభలుచేయుచు నందరు నొక్కటిగఁగూడి ప్రతిజ్ఞాపూర్వకముగ నొక్కవ్యయమును నిర్ధారణముచేసి యేవరకర్తయును సంతకంబెట్టి నెక్కువకోరకుండునట్లొప్పందముచేసికొందము రండురండు అని చెప్పుచుందురు. కాని వారిప్రయత్నములన్నియు సంపూర్ణసాఫల్యతను బడయుటలేదు. ఎట్లుకాఁగలదు? ఏ

జాతిభేదమునుండి బాల్యవివాహము లుత్పన్నములయినవో, యేజాతిభేదాచారమువలన నొకమంచివరునిఁగూర్చి వేలముపాట బడుచున్నయదో అట్టి యాచారము మార్చఁబడకుండునంతవరకు పైఁ గనినయనిష్టము నివారింపఁబడనేరము.

౮. ఎనిమిదవ యనిష్టము. జాతిభేదాచారము అధర్మమునందు ప్రతిష్ఠింపఁబడియుండుటచేతనే దానిపై నాకింత ద్వేషము. జగదీశ్వరుఁడు మానవునికి దేహసంబంధమైనట్టియు, మనస్సంబంధమైనట్టియు శక్తుల నిచ్చి తచ్ఛక్తులను స్వేచ్ఛానుసారముగఁ బ్రతియొక్కఁడును తనయున్నతిసాధనముకొఱకును, ఇతరులయొక్క కల్యాణసాధనముకొఱకును నియోగించుటకై యధికారము నిచ్చియున్నాఁడు. ఇదియే యీశ్వరునియొక్క విధి. జాతిభేదమనునది యీవిధిని నుల్లంఘనముచేసి "నీవు బుద్ధిమంతుఁడవైనను, జ్ఞానివయినను, ధార్మికప్రవరుఁడవయినను శూద్రుఁడవైనయెడల నీవు బ్రాహ్మణునితో సమానమైన యధికారమును బొందఁజాలవు" అని చెప్పుచున్నది. ఇట్టి న్యాయవిరుద్ధమైనట్టియు, ధర్మవిరుద్ధమును, ఈశ్వరేచ్ఛావిరుద్ధమును నైన విధిప్రచలితమగుటంజేసియే బహుశతాబ్దములనుండియు బ్రాహ్మణులు బ్రాహ్మణేతరజాతులయొక్క ప్రతాపమును, అధ్యాత్మికశక్తులను పైకిఁ దలయెత్తనీకుండ నణచివేసిరి. వారల నీవిధముగఁ బడతలదునుండి త్రొక్కివేయుటవలననే గదా దేశమునకుఁ బెక్కుకీడులు మూడియుండుట? వారు నిరాటంకముగాఁ దమశక్తులనన్నిటిని వికసింపఁజేసికొనుట కనుకూలములొసంగఁబడియుండెనేని వారు తమశక్త్యనుసారముగ నున్నతపదము నారోహించుటకు వీలుండెనేని, వారు తదనురూపమగు సామాజికసంభ్రమమును పొందుటకు సమర్థులయి యుందురేని, వారు తమయొక్క ప్రతిభాలోకముచే దేశీయ సాహిత్యమును నాలోకితమగునట్లుఁ జేసి యుందురేని, యప్పుడు వారిగౌరవముచేత దేశమింకను గౌరవాన్వితముగాకపోవునా? వారియొక్క యశస్సౌరభముచే భారతాకాశము ఆమోదితము కాకుండునా? ఆలాభమెవరికిఁ జెందియుండునది? వర్తమానకాలమున జాతిభేదముయొక్క తీవ్రతశిథిలమగుటచేఁ గలిగినఫలమును మనము గాంచుటలేదా? మనడాక్టర్ మహేంద్రలాల సర్కార్, మన కృష్ణదాసీపాల్ వీరినామములను స్మరించినంతమాత్రమున స్వదేశము గౌరవాన్వితమయినదని తలచుటలేదా? జాతిభేదమే ప్రబలముగనుండినచో వీరెక్కడనుండెడివారు? వీరివలన దేశమెంతయుపకృతిని బొందియుండలేదు? ఆలోచనలేనియువకులారా! ఈదురంతమైన జాతిభేదమే లేకుండినచో నింకను నెందరో మహేంద్రలాల సర్కార్ వంటివారును కృష్ణదాస్ పాలోవంటివారును జన్మించియుండియుందు రను విషయమును నెప్పుడయినను నాలోచించితిరా? కనుక నిప్పుడు జాతిభేదాచారము మీదేశమున కెట్టిశత్రువైనదో చూడుఁడు. ఇల్బర్టుబిల్ యాందోళనకాలములో నాంగ్లేయులు "భారతీ

యులు విద్యయందును, బుద్ధియందును నెంతయభివృద్ధినంది నప్పటికిని మాతోఁ సమానమయిన యధికారమును బొందఁజాలరు" అని చెప్పియుండిరి. అందుకు మీరందరును గోపించుకొంటి రేల? అది జాతిభేదము అనియేగదా, అది ధర్మవిరుద్ధమనియే గదా! దానికి భిత్తిస్థానము పాపమనియేగదా!

౯. తొమ్మిదవ యనిష్టము. ఈ జాతిభేదాచారము వలననే యీదేశవాసులకు నితరులయొక్క దాసత్వపాశమును మెడకుఁ దగిలించుకొనుట సహజమయినది. బ్రాహ్మణేతరులసంఖ్య యెల్లప్పుడును దేశమునందు నధికముగ నుండుచువచ్చెను. ఆ బ్రాహ్మణేతరజాతులన్నియును ఘోరమగు నధ్యాత్మిక దాసత్వమున వాసముచేయుచు మనుష్యత్వవిహీనులయిపోయిరి. కావున విదేశీయు లీదేశమును నాక్రమించుకొనినపుడు మానుషత్వవిహీనులును దాసత్వమున కలవాటుపడినవారును నగు జాతులన్నియు ననాయాసముగ వారిదాసత్వబంధమును దమమెడలో ధరించుటకు సమ్మతించిరి.

ఇఁక నధికముగా దోషములను జూపుటవలనఁ బ్రయోజనము లేదు. ఈ జాతిభేదమునుండియే సకలయనర్థములును వాటిల్లినవి. ఈ జాతిభేదాచారమే భారతవర్షమున నీర్ష్యానలమును బ్రజ్వలింపజేసినది. దీనివలననే భ్రాతృవిద్వేషము సంఘటిల్లినది. ఇదియే కాయికపరిశ్రమమును నికృష్టముగఁ జేసినది. శిల్పవాణిజ్యములను దుర్గతినందించినది. దారిద్ర్యమువలని బా

ధను వృద్ధిచేసినది. శారీరకమానసికదౌర్బల్యములకుఁ గారణమయినది. సామాజికోన్నతిమార్గమును నాటంకపఱచినది. హిందువుల మనుష్యత్వమును హరించి వారిలోఁ గాపురుషతను వృద్ధిచేసినది. బాల్యవివాహము, బహువివాహములనెడి దురాచారములను బ్రసరించినది. శారీరకమానసికోన్నతిమార్గమును నిరోధించినది. వందలకొలఁది సంవత్సరములనుండియు నిమ్న జాతులను ద్రొక్కిపెట్టినది. మఱియు నన్నిటికంటెను నీదేశవాసులను బరులపాలుజేసి వారిదాసత్వపాశవహనమునకు వారిని సిద్ధముచేసినది. ఇఁక మీరేమివినఁగోరెదరు? ఇట్టి యాచారమును సమర్థించుచు మరల మాటలాడఁగలరా? ఈయనిష్టములనన్నిటిని దలంచుకొనినపుడు ఈ జాతిభేదాచారమే యొక చెట్టయియుండినయెడల దానిని రెండుచేతులతో గట్టిగాఁబట్టుకొని పెకలించివేసియుందునని చెప్పుచున్నాను. అది యున్నతిమార్గమునఁ గంటకమును దేశమునకు శత్రువునై యున్నది.

ఓం తత్సత్.

Sree Savitri Press, Cocanada.

ప్రకటన

ఈగ్రంథకర్తగారిచే రచియింపఁబడిన యితరగ్రంథములు

శిఖుల బలిదానము	...	రు 0-4-0

ఇందు శిఖుల దేశభక్తి, మతాసక్తి, సత్యానురక్తి, స్వార్థత్యాగము మున్నగునవి చక్కనిశైలితో వర్ణింపఁబడినవి.

స్వర్గీయదాంపత్యము	...	రు 0-1-0
బాబా నానాకుని జీవితము	...	0-1-6
శ్రీ రాజా రామమోహనరాయ్	...	0-1-0
బ్రాహ్మమతసిద్ధాంతములు	...	0-0-6

పై గ్రంథములు వలయువారు కాకినాడ, రామారావుపేటలోనున్న శ్రీయుత ఫింజమూరి వెంకట లక్ష్మీనరసింహరావుగారికి వ్రాసిపొందఁగలరు.

END OF
TITLE